

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

మార్చి, 2026

సంపుటి - 12 | సంచిక-03 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్‌లో నిర్వహించిన అగ్రియూత్ ఫెస్ట్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



నేల ఆరోగ్య విభాగం, సి-నారే, పిజెటిఏయు ఆధ్వర్యంలో నేల పరీక్షలు, స్థానిక వాతావరణ ప్రభావాలు, పంటల వ్యవస్థలు మరియు సేంద్రియ ఎరువుల వినియోగం అనే అంశం పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రచురణ విడుదల చేస్తున్న పరిశోధన సంచాలకులు డా॥ ఎం. బలరాం మరియు ఇతర అధికారులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సివిల్ సర్వీస్ ఆస్పిరెంట్స్‌తో ముచ్చటిస్తున్న డా॥ బి. గోపి, ఐఏఎస్ మరియు వర్సిటీ ఉన్నతాధికారులు



కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాలో భాగంగా ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఉత్తర తెలంగాణ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సహ వ్యవసాయ సంచాలకులు డా॥ హరీష్ కుమార్ శర్మ




తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొద్దుతిరుగుడు సాగుపై అవగాహన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు



వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్‌లో ఏర్పాటు చేసిన నూతన వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

మార్చి, 2026

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి శ్రీ పరాభవ నామ సం॥ర చైత్ర శుద్ధ త్రయోదశి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ సి. పద్మవేణి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ వి. సునిత

సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం)

డా॥ బి. పద్మజ

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

పర్యవేక్షణ

డా॥ ఆర్. సునిత దేవి

ప్రధాన శాస్త్రవేత్త, (కీటక శాస్త్రం)


వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి


చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఏ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.......... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.......... 11
4. సాంకేతిక వ్యాసాలు
   - యాసంగి వరిలో అధిక నూకలు - కారణాలు, నివారణ చర్యలు.......... 12
   - కొర్రల ప్రాముఖ్యత మరియు వేసవి కొర్రలో యాజమాన్య పద్ధతులు.......... 14
   - నువ్వుల విత్తనోత్పత్తి - రైతులకు మార్గనిర్దేశం.......... 16
   - శనగ పంట కోత మరియు కోతానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు.......... 18
   - ప్రత్తి పంట అనంతరం మరియు జిన్నింగ్ మిల్లులో చేపట్టవలసిన గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులు.......... 20
   - చెఱకు సాగు - నేలల లక్షణాలు మరియు ఎంపిక.......... 22
   - దశరథ గడ్డి సాగు - యాజమాన్యం.......... 24
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......... 25
   - ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మెగా స్నాతకోత్సవం.......... 26
   - వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రియూత్ ఫెస్ట్.......... 28
   - వ్యవసాయ పదవినోదం.......... 30
   - పామాయిల్ సాగు, పామాయిల్ నూనె వాడకం వలన కలిగే లాభాలు మరియు అపోహాలు మీకు తెలుసా !.......... 31
   - జీవన ఎరువులు పంటకు సిరులు.......... 34
   - మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......... 36
   - కరివేపాకును ఆశించే పురుగులు, తెగుళ్ళు - నివారణ మరియు వాటి నియంత్రణలో పాటించవలసిన సురక్షిత కాలం.......... 38
   - పండ్ల తోటలలో కాయ పగుళ్ళు కారణాలు - నివారణ చర్యలు.......... 39
   - ఔషధ గుణాలు కలిగిన ఆహారం: ఆరోగ్య పెన్నిధి మునగ ఆకులు.......... 41
   - కొర్రమేను చేపల పెంపకం.......... 43
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......... 46
6. రైతన్నకో ప్రశ్న.......... 47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......... 48
8. రైతు విజయగాథ
   - బజ్జి మిరప సాగుతో అధిక లాభం ఆర్జిస్తున్న రైతు విజయగాధ.......... 49

# మార్చి మాసం క్యాలెండర్ - 2026

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి శ్రీ పరాభవ నామ సం॥ర చైత్ర శుద్ధ త్రయోదశి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| 1 ఫాల్గుణ శుద్ధ<br>త్రయోదశి రా.7-04<br>పుష్యమి ఉ.8-39<br>రా.వ.9-02 ల 10-35 | 2 చతుర్దశి సా.5-49<br>ఆశ్రేష ఉ.7-53<br>రా.వ.7-43 ల 9-17 | ○ 3 పూర్ణిమ సా.5-01<br>మఘ ఉ.7-32<br>ప.వ.3-35 ల 5-11 | 4 ఫాల్గుణ బహుళ<br>పాడ్యమి సా.4-41<br>పుబ్బ ఉ.7-39<br>ప.వ.3-03 ల 4-41 | 5 విదియ సా.4-51<br>ఉత్తర ఉ.8-16<br>సా.వ.5-04 ల 6-44 | 6 తదియ సా.5-33<br>హస్త ఉ.9-23<br>సా.వ.5-55 ల 7-37 | 7 చవితి సా.6-44<br>చిత్ర ఉ.10-59<br>సా.వ.5-04 ల 6-48 |
| 8 పంచమి రా.8-19<br>స్వాతి ప.1-01<br>రా.వ.7-10 ల 8-55 | 9 షష్ఠి రా.10-13<br>విశాఖ ప.3-21<br>రా.వ.7-47 ల 9-33 | 10 సప్తమి<br>రా.12-19<br>అనూరాధ<br>సా.5-55<br>రా.వ.12-07 ల<br>1-54 | 11 అష్టమి రా.2-24<br>జ్యేష్ఠ రా.8-31<br>తె.వ.5-20 ల | 12 నవమి తె.4-20<br>మూల రా.11-00<br>ఉ.శే.వ.7-06 వ<br>రా.వ.9-14 ల<br>11-00 | 13 దశమి తె.5-57<br>పూర్వాషాఢ<br>రా.1-12<br>ఉ.వ.9-28 ల<br>11-12 | 14 ఏకాదశి పూర్తి<br>ఉత్తరాషాఢ<br>తె.3-02<br>ఉ.వ.9-48 ల<br>11-32 |
| 15 ఏకాదశి ఉ.7-16<br>శ్రవణం తె.4-24<br>ఉ.వ.7-15 ల<br>8-56 | 16 ద్వాదశి ఉ.7-58<br>ధనిష్ఠ తె.5-17<br>ఉ.వ.8-32 ల<br>10-12 | 17 త్రయోదశి<br>ఉ.8-11<br>శతభిషం<br>తె.5-40<br>ప.వ.12-35 ల<br>2-13 | 18 చతుర్దశి ఉ.7-53<br>పూర్వాభాద్ర<br>తె.5-35<br>ప.వ.12-03 ల<br>1-38 | ● 19 అమావాస్య ఉ.7-06<br>శ్రీ పరాభవ చైత్ర<br>శు.పాడ్యమి తె.5-47<br>ఉత్తరాభాద్ర తె.5-04<br>ప.వ.2-58 ల 4-32 | 20 విదియ తె.4-11<br>రేవతి తె.4-10<br>సా.వ.4-36 ల<br>6-09 | 21 తదియ రా.2-16<br>అశ్విని రా.2-58<br>రా.వ.11-09 ల<br>12-41 |
| 22 చవితి రా.12-08<br>భరణి రా.1-33<br>ప.వ.12-00 ల<br>1-30 | 23 పంచమి రా.9-49<br>కృత్తిక రా.11-58<br>ప.వ.12-45 ల<br>2-14 | 24 షష్ఠి రా.7-24<br>రోహిణి రా.10-16<br>ప.వ.2-50 ల<br>4-19<br>తె.వ.3-28 ల<br>4-58 | 25 సప్తమి సా.4-58<br>మృగశిర రా.8-36<br>తె.వ.4-28 ల<br>5-58 | 26 అష్టమి ప.2-42<br>ఆర్ద్ర రా.7-05<br>వర్జ్యము లేదు | 27 నవమి ప.12-31<br>పునర్వసు సా.5-41<br>ఉ.వ.6-23 ల<br>7-53<br>రా.వ.1-19 ల<br>2-50 | 28 దశమి ఉ.10-35<br>పుష్యమి సా.4-33<br>తె.వ.4-55 ల |
| 29 ఏకాదశి ఉ.8-55<br>ఆశ్రేష సా.3-43<br>ఉ.శే.వ.6-28 వ<br>తె.వ.3-30 ల<br>5-05 | 30 ద్వాదశి ఉ.7-39<br>మఘ ప.3-18<br>రా.వ.11-18 ల<br>12-54 | 31 త్రయోదశి ఉ.6-50<br>పుబ్బ ప.3-19<br>రా.వ.10-39 ల<br>12-17 | | | | |

03 హోళీ
19 ఉగాది
21 ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)
22 రంజాన్ తదుపరి దినం
27 శ్రీరామ నవమి
10 షహదత్ హజత్ అలీ (ఆర్.ఎ)
13 జుమాతుల్ వదా
17 సాబ్-ఇ-క్వాదర్
31 మహావీర్ జయంతి

**పూర్వాభాద్ర కార్తె (04.03.26 నుండి 16.03.26)**

| | | |
|---|---|---|
| వరి | : | ఆలస్యంగా నాటితే రెండవ దఫా ఎరువులు వేయుట, సస్యరక్షణ. |
| గోధుమ | : | కోతలు. |
| జొన్న | : | వేసవి పంటకు సస్యరక్షణ. |
| రాగి | : | రబీ రాగి కోతలు. |
| సజ్జ | : | సస్యరక్షణ. |
| వేరుశనగ | : | ఎరువులు - సస్యరక్షణ |
| చెఱకు | : | జనవరిలో నాటిన పైరుకు ఎరువులు వేయుట, సస్యరక్షణ. |
| పప్పుదినుసులు | : | మాగాణిలో విత్తిన పెసర, మినుము కోయుట. |

**ఉత్తరభాద్ర కార్తె ( 17.03.26 నుండి 30.03.26)**

| | | |
|---|---|---|
| రబీ ఆముదం | : | సస్యరక్షణ, కోతలు. |
| గోధుమ | : | ఆలస్యంగా విత్తిన పంట కోతలు. |
| వేరుశనగ | : | డిశెంబర్‌లో విత్తిన పంట నుండి కాయ త్రవ్వుట. |
| పప్పుదినుసులు | : | పెసర, మినుము కోతలు. |
| వరి | : | అశ్వని కార్తెలో వేయబోయే వరిని విత్తుట. రబీలో వేసిన వరిని కోయుట |
| మొక్కజొన్న | : | రబీలో వేసిన మొక్కజొన్న కోతలు |

# వ్యవసాయంలో మహిళల పాత్ర



అల్దాస్ జానయ్య
ఉపకులపతి

భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశంలో మహిళల పాత్ర వెలకట్టలేనిది. గ్రామీణ భారతదేశంలో దాదాపు 80-84% మంది మహిళలు తమ జీవనోపాధి కోసం వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు. మహిళలు నాట్లు వేయడం, కోతలు కోయడం, కలుపు తీయడం, పశుపోషణ మరియు పాల ఉత్పత్తి వంటి అనేక పనుల్లో చురుకుగా పాల్గొంటారు. పిల్లల పోషణ మరియు ఇంటి బాధ్యత కూడా మహిళలు చేపడుతుంటారు. అయినా కుడా వారు కృషి, ఓర్పు మరియు అంకిత భావంతో వ్యవసాయాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహాయపడతారు. పురుషులు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్తున్న నేపథ్యంలో, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ బాధ్యత ఎక్కువగా మహిళల భుజస్కంధాలపైనే పడుతోంది. దీనిని నిపుణులు 'ఫెమినైజేషన్ ఆఫ్ అగ్రికల్చర్' అని పిలుస్తున్నారు.

మహిళలు కేవలం సహాయకులుగా మాత్రమే కాకుండా, వ్యవసాయంలో నాయకత్వ బాధ్యతలు కూడా స్వీకరిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వారు ఆర్థికంగా స్థిరపడుతూ, కుటుంబ పరిస్థితిని మెరుగుపరుస్తున్నారు. ఆధునిక సాంకేతికతలను నేర్చుకొని, పంటల ఉత్పత్తిని పెంచడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా రైతులకు సాధికారత కల్పించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను మరియు ఆహార భద్రతను గణనీయంగా పెంచవచ్చని ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్‌పిఓ) సూచిస్తుంది. మహిళలకు భూమి, ఋణ సౌకర్యాలు మరియు వ్యవసాయ విస్తరణ సేవలలో సమాన అవకాశాలు కల్పిస్తే పంట దిగుబడులు 20-30% వరకు పెరిగే అవకాశం ఉంది, దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా అదనంగా 100-150 మిలియన్ మంది ప్రజలకు ఆహారం అందించవచ్చని ఎఫ్ఏఓ, 2023 పేర్కొన్నది.

వ్యవసాయ రంగంలో మహిళలు పోషిస్తున్న ముఖ్యమైన పాత్రను గుర్తించి, వారిని గౌరవించి సాధికారత కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని "అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం" గా ప్రకటించింది. మహిళలను ప్రోత్సహించడం, వారి సేవలను వెలుగులోకి తీసుకురావడం మరియు సాధికారతకు మార్గాలను సూచించడం దీని ప్రధాన లక్ష్యం. ఇది కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా, మహిళా రైతుల పట్ల సమాజపు దృక్పథాన్ని మార్చేందుకు ఇచ్చిన పిలుపు కూడా. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయంలో మహిళలు చేస్తున్న కీలకమైన కృషిని సమాజానికి తెలియజేయడంతో పాటు, భూమి యాజమాన్యం, ఆర్థిక వనరులు, ఆధునిక సాంకేతికతలు మరియు శిక్షణ అవకాశాల్లో ఉన్న అసమానతలను తగ్గించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం.

ఇకపై మహిళలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో చురుకుగా భాగస్వాములుగా చేయడం, విలువ జోడించిన ఆహార ఉత్పత్తుల తయారీ, కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల నిర్వహణ, వ్యవసాయ యంత్రాల కోసం కస్టమ్ సేవా కేంద్రాలను నడపడం వంటి కార్యక్రమాలలో భాగం చేయడం ఒక ముఖ్యమైన ముందడుగు. దీని ద్వారా మహిళలు "రోజువారీ కూలీలు" అనే స్థితి నుండి "ప్రాసెసర్లు మరియు వ్యవస్థాపకులు" గా ఎదగడం ప్రస్తుత వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.

మహిళలను కేవలం "రైతు కూలీలు" గా కాకుండా "రైతులు" గా గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం మరియు అవకాశాలు కల్పించినప్పుడే వ్యవసాయం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. ఈ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం "రైతు స్వరాజ్యం" లో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తూ వారి సామర్థ్యాలను ప్రోత్సహిస్తోంది.

**"మహిళా రైతుల అభివృద్ధి - వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శి"**



(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- వరిలో పిలకవేసే దశ / దుబ్బు చేసే దశ / గంట పోసే దశ చాలా కీలకమైనవి. ప్రస్తుతం వరి పిలక వేసే దశ నుండి అంకురం దశ వరకు ఉంది. ఈ దశలో సరియైన నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం మరియు పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం చేయాలి. లేని ఎడల వరిలో దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది.
- రైతులు క్రమం తప్పకుండా పొలం కలియ తిరుగుతూ, నీటిని, పురుగులు, తెగుళ్ళ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అనవసర ఖర్చులు చేయకుండా, నిపుణుల సలహామేరకు మాత్రమే పురుగులు/తెగుళ్ళ మందులు వాడాలి.
- ఈ యాసంగి వరి పంటలో ఎక్కువగా కాండం తొలిచే పురుగు పిలకదశ మరియు చిరుపొట్ట దశల్లో ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. కనుక మార్చి మాసంలో వరి పంట అంకురం నుండి చిరుపొట్ట దశల్లో ఉన్న వరి పైర్లలో రెక్కల పురుగు ఉధృతిని గమనించుకొని నివారణ మందులు పిచికారి చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు నివారణకు ముందస్తుగానే చిరుపొట్టదశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎస్‌పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5% ఎస్‌సి 60 మి.లీ. లేదా ఐసోసైక్లోసిరమ్ 120 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఒకసారి తెల్లకంకులు ఏర్పడిన తరువాత ఎలాంటి పురుగుమందులు పిచికారి చేసినా ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలి.
- రెక్కల పురుగులను లేదా గ్రుడ్ల సముదాయాలను ఎప్పటికప్పుడు రైతులు గమనించుకోవాలి.
- ఈ యాసంగిలో జనవరి-ఫిబ్రవరి మాసాల్లో చలి, చౌడు, జింకు ధాతులోపం మరియు సల్ఫైడ్ దుష్ప్రభావం వలన వరి పైర్ల ఎదుగుదల లోపించింది. రైతులు పంట ఎదుగుదల కొరకు పొలాన్ని ఆరబెట్టడం మరియు పైపాటుగా నత్రజని ఎరువును అధిక మొత్తంలో వేయడం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో ముఖ్యంగా మార్చి మాసంలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది. కావున తెగులు తొలిదశ (ఆకుమచ్చ దశ) లో ఎకరానికి ఐసోప్రోథయోలిన్ 300 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారి చేయాలి. ఒకవేళ ఉధృతి ఎక్కువగా గమనించినట్లైతే ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 80 గ్రా. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3 యస్‌సి 200 మి.లీ. లేదా పికాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ 400 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.
- అగ్గితెగులు ఉధృతి గమనించినట్లైతే పొలాన్ని పూర్తిగా ఆరబెట్టినట్లైతే ఉధృతి ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉందని రైతులు గమనించాలి.
- వరి పైరు అంకురం ఏర్పడే దశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు చివరి దఫా ఎరువులను వేయాలి. ఒక ఎకరానికి 35 కిలోల యూరియా మరియు 15-20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి.

**డా॥ ఐ. స్వర్ణలత దేవి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218**

## మొక్కజొన్న

యాసంగిలో ముందుగా విత్తుకున్న మొక్కజొన్న పైరు కోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వ దశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పైపొర ఎండిపోవుట,



## చిరుధాన్యాలు

గింజలు వేలి గోరుతో నొక్కినపుడు గట్టిగా ఉండి నొక్కులు ఏర్పడక పోవుట, కొన్ని రకాలలో గింజ అడుగు భాగంలో నల్లటి చార ఏర్పడుట వంటి లక్షణాలను బట్టి పరిపక్వ దశను గుర్తించవచ్చు. కొన్ని వంగడాలలో పక్వ దశకు చేరుకున్న తర్వాత కూడా పైరు పచ్చగా ఉండడం గమనించవచ్చు. గింజలలో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి. కోసిన కండెలను ఎండలో బాగా ఆరబెట్టి గింజలలో సుమారు 15 శాతం తేమ ఉండగా యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను 2-3 రోజులు ఎండలో 10-12 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి.

యాసంగిలో ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పైరు పూతదశలో ఉన్న యెడల నీటిని సమృద్ధిగా అందచేస్తూ నాల్గవ దఫా నత్రజని ఎరువును ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలోను పైపాటుగా వేయవలెను.

కాండం కుళ్ళు తెగులు ఆశించు ప్రాంతాల్లో పూతదశ నుండి పైరు బెట్టకు గురి కాకుండా చూడవలెను. పొడతెగులు ఆశించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన 1-2 ఆకులను తీసివేయవలెను. కలుపు లేకుండా శుభ్రమైన పంటసాగును అవలంబించవలెను. ప్రోపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పొడతెగులును నివారించుకోవచ్చు.

ప్రస్తుత యాసంగిలో బాగా ఆలస్యంగా విత్తిన మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగింది. పైరు మోకాలు ఎత్తు నుంచి పూతదశకు వచ్చే వరకు పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. దీని నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనిటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరు పై మొక్క సుడి తడిచేటట్లు పిచికారి చేయాలి. ఇసుక మరియు సున్నం కలిపిన మిశ్రమాన్ని 9:1 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్కసుడిలో పడునట్లుగా వేయాలి.

**జొన్న:** ఆలస్యంగా, నీటి పారుదల క్రింద వేసిన జొన్న పంటకు గింజపాలు పోసుకొనే దశలో బెట్టకు గురికాకుండా ఒక నీటి తడి ఇవ్వాలి. యాసంగిలో విత్తుకున్న పొలాల్లో జొన్న పంటకోతకు వస్తుంది. కంకుల్లో గింజ క్రింద భాగాన నల్లటి చార ఏర్పడిన తరువాత కొతను చేపట్టాలి. గింజలో తేమ శాతం 10% వచ్చే వరకు ఎండబెట్టుకొని నిల్వచేసుకోవాలి.

**సజ్జ:** జనవరి మాసంలో విత్తుకున్న సజ్జపంట పూత దశలో ఉంటుంది. బెట్ట నుండి పంటను కాపాడటానికి నీటి తడులు ఇవ్వాలి. తుప్పు తెగులు ఆశించినపుడు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మొక్కలు చిన్నగా ఉన్నట్లయితే అంతరకృషి చేసుకోవాలి.

**రాగి:** రాగి పంట పూత దశలో ఉంటుంది కావున పంట బెట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలి. మొక్కల పైన అగ్గి తెగులు గమనించినట్లయితే హెక్సాకోనజోల్ 2 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**కొర్ర:** కొర్ర పంట పూత దశలో ఉన్నట్లయితే బెట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలి.

**డా॥ డి. భద్రు, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు)**
మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 83338 18245

## వేరుశనగ

- యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. కాయలు 70-80% వరకు పక్వానికి వచ్చినట్లయితే కోత చేపట్టాలి.
- కోత అనంతరం నూర్పిడి యంత్రాలతో కాయలను వేరు చేయాలి. దీనివల్ల కూలీల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం



గంటకు 2-2.5 క్వింటాళ్ళ కాయలను ఈ యంత్రాల ద్వారా వేరు చేయవచ్చును.

- ఆలస్యంగా విత్తిన వేరుశనగ గింజ అభివృద్ధి దశలో ఉంది. కావున నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- గింజ అభివృద్ధి దశలో ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ తెగులు ఉధృతి గమనించిన వెంటనే టెబ్యుకొనజోల్ 200 మి.లీ. (లేదా) క్లోరోథలోనిల్ 400 గ్రా. ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.
- వేసవిలో విత్తిన వేరుశనగలో కాండం కుళ్ళు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు గమనించిన వెంటనే 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళలో తడిచేలా పిచికారి చేయాలి.

## ఆముదం

- యాసంగిలో సాగు చేసిన ఆముదం ప్రస్తుతం గెల అభివృద్ధి దశలో ఉంది. ఈ దశలో పంట నీటి ఎద్దడికి గురి కాకుండా నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజులకు ఒక తడి అందివ్వాలి.
- వేసవి కాలంలో రసం పీల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు లీటరు నీటికి 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ (లేదా) 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ కలిపి పిచికారి చేయాలి.
- కాయ తొలుచు పురుగు ఉధృతి గమనించినట్లయితే లీటరు నీటికి 1 మి.లీ. నొవాల్యూరాన్ లేదా 2 మి.లీ. ప్రోఫినోపాస్ కలిపి పిచికారి చేయాలి.
- ఎండు తెగులు గమనించినట్లయితే లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి మొక్క మొదళ్ళు తడిచేలా పిచికారి చేయాలి.

- వేసవిలో విత్తుకున్న నువ్వులు ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ సమయంలో పంట పూత మరియు కాయ వచ్చే దశ కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చేసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల ఉధృతి ఉన్నట్లయితే లీటరు నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. (లేదా) ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- నువ్వు పంటలో బూడిద తెగులు ఉధృతి గమనించినట్లయితే లీటరు నీటికి గంధకం 3 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- వేసవిలో సాగు చేసిన ప్రొద్దు తిరుగుడు పంట ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ దశలో పైపాటుగా 16 కిలోల యూరియాను వేయాలి.
- పువ్వులు విచ్చుకునే దశలో బోరాక్స్ 2 గ్రా. పొడిని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నెక్రోసిస్ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు నివారణకు 0.2 గ్రా. థయోమిథాక్సామ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## కుసుమ

- యాసంగిలో సాగు చేసిన కుసుమ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది.
- కోత అనంతరం తేమ శాతం 5-8% వచ్చే వరకు ఆరబెట్టాలి. దీనివల్ల గింజ నాణ్యత పెరుగుతుంది.
- కుసుమ పంటను ఉదయం సమయంలో కోసినట్లయితే గింజ తక్కువ రాలుతుంది మరియు ముళ్ళు ఎక్కువగా గుచ్చుకోవు.

డా॥ ఎమ్. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838



## అపరాలు

**పెసర, మినుము:** పెసర, మినుములో కలుపు నివారణ: పైరు విత్తిన 20-25 రోజుల మధ్యలో ఎకరాకు 250 మి.లీ. ఫెనాక్సీప్రాప్-పి-ఇథైల్ లేదా 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి ఊదను సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ఊదతో పాటు వెడల్పాటి కలుపు జాతి మొక్కలు ఉన్నట్లైతే ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి కలుపును సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

**నీటి యాజమాన్యం:** బెట్ట పరిస్థితుల్లో అవసరం మేరకు కీలక దశలో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో నీటి పారుదల క్రింద పండిస్తారు. ఆలస్యంగా విత్తినప్పుడు చివరిలో పైరు బెట్టకు గురయ్యే అవకాశమున్నది. కాబట్టి అవకాశమున్న చోట పైరు పూత దశకు ముందుగా అనగా 30 నుండి 40 రోజుల వయస్సులో తేలికపాటి నీటి తడి ఇవ్వవలెను. సాధారణంగా పంట కాలానికి 300-450 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.

**కీలక దశలు:** పూత మరియు కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి. బెట్ట పరిస్థితులలో 2 శాతం (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణాన్ని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు పిచికారి చేయాలి.

కాయతొలిచే పురుగుల నివారణకు ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు.

**తెగుళ్ళ యాజమాన్యం:** సాధారణంగా కోరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, త్రుప్పు మరియు సర్కోస్పోరా తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టడానికి పైరు 30-35 రోజుల వ్యవధిలో లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 50-55 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.

**శనగ:**

**పంటకోత:** పంట పరిపక్వత దశకు చేరిన తర్వాత ఆకులు మరియు కాయలు పసుపు రంగుకు మారి ఆ తర్వాత వరి గడ్డి రంగుకు మారును. ఆకులు పూర్తిగా రాలిపోయి మొక్కలు ఎండిపోవును. మొక్కలను మొదలు వరకు కోసి కుప్పగా వేసుకొని ట్రాక్టర్‌తో తొక్కించి లేదా కర్రలలో కొట్టి కాయల నుండి గింజలను వేరు చేయాలి. యాంత్రికంగా కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడా పంటను కోయవచ్చు.

**కోతానంతర జాగ్రత్తలు:** పంట కోసిన తర్వాత గింజలు తగినంత ఎండే వరకు ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కాని, చేతితో కాని నూర్చుకోవచ్చు. దుమ్ము, ధూళీ, తాలు గింజల విత్తనాలను తొలగించి నిల్వ చేయాలి. నిల్వ చేయడానికి విత్తనాలలో తేమ 9 శాతం మించకుండా చూడాలి.

డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041

## చెఱకు

ఈ వేసవి కాలంలో చెఱకు పంట బాల్యదశలో ఉంటుంది. ఇది చాలా కీలకమైన మరియు తేమ సున్నితమైన దశ అనుకూలమైన వాతావరణ పరిస్థితులలో మొక్క మరియు మోడెం తోటలు బాల్యదశలో ఎక్కువ సంఖ్యలో పిలకలు అభివృద్ధి చెంది, తర్వాత పంట ఏపుగా ఎదిగే దశకు చేరుకుంటాయి. నీటి ఎద్దడి మరియు అధిక ఉష్ణోగ్రతల వలన మొక్క ఒత్తిడికి లోనై తోటలలో పిలకల సంఖ్య క్రమేపి తగ్గి, దీని ప్రభావం తోట ఎదుగుదలపై ఉండి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.



ఆలస్యంగా నాటిన చెఱకు తోటలకు పోషక లోపాలతో పాటు చీడపీడల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. చెఱకు మోడెం సాగులో ఇనుము, జింకు మరియు మాంగనీసు ధాతువుల లోపాలు ఎక్కువగా కనబడుతుంటాయి. కావున బాల్య దశలో ఉన్న చెఱకును నీటి ఎద్దడి, ఎండ తీవ్రత బారిన పడకుండా తగు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

ఇనుప ధాతువు లోపం వల్ల ఆకులు పాలిపోయి లేత పసుపు రంగు నుండి తెలుపు రంగుకు మారుతాయి. ఈ లక్షణాలు ఈనెల మధ్య భాగంలో ఏర్పడి ఈనెలకు సమాంతరంగా రేఖలుగా ఆకులకు పొడవునా చారలు ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లేత ఆకులు పూర్తిగా తెల్లగా మారతాయి. ఇనుము లోపం కనిపించిన వెంటనే లీటరు నీటికి 10 గ్రా. అన్నబేధి ఒక బద్ద నిమ్మకాయ లేదా 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలుపుకొని వారం, పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

జింకు లోపం కనిపించిన మొక్కలలో ఆకుల ఈనెల వెంబడి పసుపు రంగు చారలు ఏర్పడి లోపం ఎక్కువ అయినప్పుడు పెరుగుదల నిలిచిపోతుంది. దుబ్బు చేయడం నిలిచిపోయి, కొత్తగా ఏర్పడిన పిలకలు నిర్వీర్యం అవుతాయి. లోపం కనిపించిన తోటలకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ (0.2% ద్రావణం) చొప్పున వారం వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. ఆఖరి దుక్కిలో ముందుగానే ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ చొప్పున నేలలో వేసినట్లైతే లోపం రాకుండా నివారించవచ్చును.

కార్శి తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవటం వలన కార్శి తోటలలో సగటు చెఱకు దిగుబడులు తగ్గుతున్నాయి. అందువలన చెఱకు సాగు చేసే రైతులు, రకాల ఎంపిక నుండి మొక్క తోటలను సకాలంలో నరకటం వరకు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

చెఱకును నరికిన తరువాత కార్శి చేయటం వలన విత్తనపు ఖర్చుతో పాటు పొలం తయారి ఖర్చు తగ్గి చెఱకు సాగులో ఎంతో లాభం చేకూరుతుంది. మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ల మధ్య దుక్కి చేసి భూమి గుల్ల బారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి పిలకల నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణవాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలకు నీరు, పోషకాలు సమాంతరంగా అందుతాయి.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్
వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్,
ఫోన్ నెం. 9849535756

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి  మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో 01.01.2026 నుండి 28.02.2026 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 12.5 మి.మీ. గాను 6.5 మి.మీ అనగా సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం (−48 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (04.03.2026) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి − 111 శాతం (5732497), జొన్న − 153 శాతం (303915), మొక్కజొన్న − 177 శాతం (1145287), కంది − 46 శాతం (2416), శనగ − 61 శాతం (186985), పెసర − 31 శాతం (7101), మినుములు − 66 శాతం (36412), వేరుశనగ − 74 శాతం (192565), ప్రొద్దుతిరుగుడు − 71శాతం (17521) మరియు కుసుమ − 77శాతం (9556) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 112 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 24 శాతం, నూనె గింజల పంటలు 59 శాతం సాగుచేయటం జరిగింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం రాష్ట్రంలో మార్చి మాసంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న మరియు మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును. తక్కువ నీటి వసతి గల ప్రాంతాలలో పశుగ్రాస పంటలుగా సజ్జ మరియు బొబ్బర్ల పంటలను వేసుకోవచ్చును.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కారణంగా నీటి వసతి తక్కువ ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పంటలకు నేల స్వభావం బట్టి 10−15 రోజుల వ్యవధిలో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.
- వరి పంట దుబ్బు చేసే దశ నుండి అంకురం దశ వరకు పొలంలో 2 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి. అంకురం దశ నుండి పూత దశ వరకు నీటి లభ్యతని బట్టి పొలంలో 2 సెం.మీ. నుండి 5 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి.
- మొక్కజొన్న పూత దశ ఏర్పడే 10 రోజుల ముందు నుండి కంకి ఏర్పడిన 25 రోజుల తర్వాత వరకు పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు. కావున రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వవలెను.
- పూత దశలో ఉన్న పెసర మరియు మినుము పంటలకు (35−40 రోజుల) తేలికపాటి నీటి తడి ఇవ్వాలి.
- యాసంగిలో ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగ గింజ అభివృద్ధి దశలో ఉంది. ఈ దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- 40 నుండి 50 రోజుల దశలో ఉన్న నువ్వుల పంట పూత మరియు కాయ ఏర్పడుతుంది కాబట్టి పంటను నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

ఈ మాసంలో నెలకొనే వాతావరణ పరిస్థితులు ఈ క్రింద ఉదాహరించిన పురుగులు తెగులు వివిధ పంటలలో ఆశించుటకు అనుకూలం.

- మొక్కజొన్నలో అధిక ఉష్ణోగ్రతలు మరియు భూమిలో ఎక్కువ తేమ వలన పాము పొడ తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు, తెగులు ఆశించిన క్రింది భాగంలోని (1లేదా 2) ఆకులను తీసివేయాలి.
- 1 మి.లీ. ప్రొపికొనజోల్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 2 మి.లీ. వాలిడామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన తీగజాతి కూరగాయ పంటలలో పెంకు పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు, 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన తీగజాతి కూరగాయ పంటలలో పేనుబంక ఆశించుటకు అనుకూలం. నివారణకు 2 మి.లీ. డైమిథోయెట్ లేదా మిథైల్ డెమటాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# యాసంగి వరిలో అధిక నూకలు - కారణాలు, నివారణ చర్యలు

డా॥ రమ్యా రాథోడ్, డా॥ వై.ఎస్. పరమేశ్వరి, ఎం. సాయి చరణ్, డా॥ కృష్ణ చైతన్య, జి. రాకేష్, మంజు భార్గవి,
డా॥ ఆర్. రమేష్, డా॥ ఫిర్దోస్ సహానా, డా॥ జే. చంద్రకళ, శ్రీ దివ్య మరియు డా॥ కె. పవన్ చంద్రా రెడ్డి
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానము, రుద్రూర్, నిజామాబాద్



యాసంగిలో వరి సాగు చేస్తున్న రైతులు ఇటీవల కాలంలో ఎదుర్కొంటున్న ప్రధాన నాణ్యతా సమస్య నూక శాతం అధికంగా రావడం. వరి ధాన్యంలో నూకలు ఎక్కువగా రావడం వల్ల మార్కెట్‌లో బియ్యం గ్రేడ్ తగ్గి, రైతులకు లభించే ధర గణనీయంగా పడిపోతుంది. సాధారణంగా ఈ సమస్యను కోత తర్వాత మిల్లింగ్ సమయంలో వచ్చే లోపంగా మాత్రమే భావిస్తారు. కానీ నిజానికి ఇది పంట పెరుగుతున్న దశ నుంచే ప్రారంభమయ్యే సమస్య. అధిక నూక శాతం రావడానికి ముఖ్య కారణాలు

### అధిక ఉష్ణోగ్రతల ప్రభావం:

యాసంగిలో అధిక గరిష్ఠ మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరి గింజల నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. పంట పూత దశ నుంచి గింజ నిండే దశ వరకు అధిక ఉష్ణోగ్రతలు ఉంటే గింజల లోపలి నిర్మాణం సరిగా ఏర్పడదు. దీనివల్ల పిండి పదార్థం సమంగా నిండక గింజ బలహీనంగా మారుతుంది. అటువంటి ధాన్యం మిల్లింగ్ సమయంలో సులభంగా విరిగి నూకల శాతం పెరుగుతుంది. అలాగే రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు మొక్క తాను తయారు చేసిన ఆహారాన్ని ఎక్కువగా ఖర్చు చేసుకుంటుంది. దాని వలన గింజ పూర్తిగా నిండదు. అందుకే రైతులు తక్కువ పంట కాలం రకాలను ఎంచుకొని నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ రెండో వారం లోపు విత్తితే, అధిక వేడి ప్రభావాన్ని తప్పించుకుని మంచి ధాన్య నాణ్యతతో పాటు ఎక్కువ లాభం పొందవచ్చు.

### పోషక యాజమాన్యం:

పంట పోషక యాజమాన్యంలో సమతుల్యత లేకపోవడం వల్ల నూకల సమస్య మరింత పెరుగుతుంది. నత్రజని ఎరువులను అధికంగా వినియోగిస్తే వరి పంటలో ఆకులు ఎక్కువగా పెరిగి, మొక్క శక్తి అంతా వాటికే ఖర్చవుతుంది. దీనివల్ల ధాన్యం నిండే ప్రక్రియ దెబ్బతింటుంది. అదే సమయంలో పొటాష్ లోపం ఉంటే గింజలు సరిగ్గా నిండక, కోత తర్వాత మిల్లింగ్ సమయంలో గింజలు సులభంగా విరిగిపోతాయి. ఫాస్ఫరస్, జింక్ మరియు సిలికాన్ వంటి పోషకాలు సరిపడా అందకపోయినా ధాన్యం యొక్క నాణ్యత తగ్గి నూకల శాతం పెరుగుతుంది. కాబట్టి దిగుబడితో పాటు ధాన్య నాణ్యతను కూడా దృష్టిలో ఉంచుకొని సమతుల్యంగా ఎరువుల వినియోగం చేయడం చాలా అవసరం.

### నీటి యాజమాన్యం:

వరి గింజ నాణ్యతను నిర్ణయించే విషయంలో నీటి యాజమాన్యం చాలా ముఖ్యమైన అంశం. గింజ నిండే దశలో నీటి

కొరత లేదా నీటి ఒత్తిడి ఏర్పడితే, ఆకుల్లో తయారయ్యే ఆహారం (సూర్యకాంతి ద్వారా) గింజలకు సరిపడా చేరదు. దీంతో గింజలు పూర్తిగా నిండక బలహీనంగా మారతాయి. అలాగే కోతకు ముందే ఒక్కసారిగా నీటిని పూర్తిగా ఆపేస్తే, గింజలలోని తేమ తగ్గి లోపల చిన్న చిన్న పగుళ్లు ఏర్పడతాయి. ఈ పగుళ్లు మిల్లింగ్ సమయంలో బియ్యం నూకలుగా విరగడానికి కారణమవుతాయి. అందుకే కోతకు 7-10 రోజుల ముందు మాత్రమే నీటిని క్రమంగా తగ్గించడం సరైన పద్ధతి. ఇలా చేస్తే ధాన్య నాణ్యత మెరుగ్గా ఉండి నూకల శాతం తగ్గుతుంది.

**సరైన కోత సమయం:**

పంటను సరైన దశలో కోయకపోవడం వల్ల కూడా నూకల సమస్య పెరుగుతుంది. పంటను పూర్తిగా పండకముందే కోస్తే గింజల్లో తేమ ఎక్కువగా ఉండి ఎండబెట్టే సమయంలో పగుళ్లు వస్తాయి. అలాగే చాలా ఆలస్యంగా కోత చేస్తే గింజలు ఎక్కువగా ఎండిపోయి సహజంగానే పగుళ్లు ఏర్పడతాయి. సాధారణంగా వరి పంటలో 80-85% గింజలు పసుపు రంగు వచ్చినప్పుడు కోత చేస్తే, నూకలు తక్కువగా ఉండి బియ్యం బాగా వస్తాయి.

**ధాన్యం ఎండబెట్టే విధానం:**

కోత తర్వాత చేసే పనుల్లో ధాన్యాన్ని ఎండబెట్టే విధానం చాలా కీలకం. ఎక్కువ వేడిలో ధాన్యాన్ని త్వరగా ఎండబెడితే గింజల బయట భాగం ముందే ఎండిపోతుంది, కానీ లోపల తేమ మిగిలిపోతుంది. దీని వల్ల గింజల లోపల ఒత్తిడి ఏర్పడి చిన్న పగుళ్లు వస్తాయి. ఈ పగుళ్లు మిల్లింగ్ సమయంలో బియ్యం నూకలుగా మారడానికి కారణమవుతాయి. అందుకే ధాన్యాన్ని నీడలో లేదా తక్కువ నియంత్రిత ఉష్ణోగ్రతలో మెల్లగా ఎండబెట్టాలి. తేమ శాతం 12-14 శాతం వచ్చిన తరువాత మాత్రమే మిల్లింగ్‌కు పంపితే, బియ్యం నాణ్యత మెరుగ్గా ఉండి నూకల శాతం తగ్గుతుంది.

రైతులు సరైన సాగు పద్ధతులను పాటించి, పంట యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే ధాన్య నాణ్యత మెరుగవుతుంది. దీని వల్ల నూకల శాతం తగ్గి మిల్లింగ్‌లో మంచి బియ్యం వస్తాయి. ఫలితంగా యాసంగి వరి సాగు మరింత లాభదాయకంగా మారి రైతులకు స్థిరమైన ఆదాయం అందుతుంది.





ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8179525139

# కొర్రల ప్రాముఖ్యత మరియు వేసవి కొర్రలో యాజమాన్య పద్ధతులు

కె. ప్రియాంక, ఎస్. శ్రీచరణ్, డా॥ జి. ప్రవీణ్ కుమార్, డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, డా॥ కె. రాజశేఖర్,
డా॥ డి. మోహన్దాస్ మరియు డా॥ శ్రీధర్ చౌహాన్
వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్



కొర్రలు ఒక అద్భుత చిరుధాన్యం, ఆహారం, ఆరోగ్యం, వ్యవసాయ ప్రాముఖ్యతలతో కూడిన సూపర్ ఫుడ్.

**పోషక విలువలు**

కొర్రల్లో ప్రోటీన్ (12%), ఫైబర్ (8-14%), ఇనుము (28- 3.6 మి.గ్రా/100 గ్రా. కాల్షియం (31 మి.గ్రా.), మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. గ్లూటన్ ఫ్రీ, తక్కువ జిఐ (గ్లైసెమిక్ ఇండెక్స్) కలిగి ఉంటుంది.

**ఆరోగ్య ప్రయోజనాలు**

**షుగర్ నియంత్రణ:** తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ (జిఐ) తో రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంచుతుంది, డయాబెటీస్ రోగులకు ఆదర్శం.

**గుండె ఆరోగ్యం:** పొటాషియం, మెగ్నీషియంతో కొలెస్ట్రాల్ని తగ్గించి రక్తపోటు నియంత్రిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగు:** ఫైబర్తో మలబద్ధకం, గ్యాస్ను తగ్గిస్తుంది.

**ఎముకల బలం:** కాల్షియం, ఫాస్ఫరస్తో ఆస్టియోపోరోసిస్ నివారిస్తుంది.

**బరువు తగ్గడం:** ఫైబర్తో ఆకలిని అదుపులో ఉంచుతుంది.

**వ్యవసాయ ప్రాముఖ్యత:** స్వల్పకాలంలోనే అధిక దిగుబడులనిచ్చే వివిధ రకాలు మరియు కొర్ర విలువ ఆధారిత ఉత్పత్తులు రావడంచే దేశీయ మార్కెట్లో డిమాండ్ పెరుగుతుండడం గమనిస్తున్నాము. మార్కెట్ డిమాండ్ను దృష్టిలో ఉంచుకొని రైతులు జనవరిలో సాగు ఆరంభించినట్లైతే అధిక దిగుబడులను ఖరీఫ్ లేదా వానాకాలం కన్నా ఎక్కువ సాధించవచ్చు.

కొర్రలు ప్రధానంగా వర్షాధార ప్రాంతాలలో తక్కువ పెట్టుబడితో తక్కువ రసాయన మందులతో పండించుకోవచ్చు. ఈ పంటకు చీడపీడల బెడద తక్కువ. ప్రస్తుతం కొర్రల వినియోగం దేశంలో ఎక్కువగా ఉండడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో కొర్రలను సాగు చేస్తున్న రైతులకు లాభాల పంట పండిస్తోంది. ఇలాంటి సమయంలో రైతులు కొర్రల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చు.

**విత్తే సమయం, అనుకూలమైన నేలలు:** కొర్ర పంట అత్యధిక బెట్ట పరిస్థితులను తట్టుకోగలదు. వేసవిలో అయితే కొర్రలను జనవరి మాసంలో విత్తుకోవచ్చును. కొర్ర పంటకు తేలికపాటి ఎర్రనేలలు అనుకూలం. నల్లరేగడి నేలల్లో కూడా వేసుకోవచ్చు. అయితే మురుగు నీటి సౌకర్యం తప్పకుండా ఉండాలి.

**విత్తన రకాలు, విత్తే దూరం:** యస్ఐఎ3085, యస్ఐఎ 3088 (సూర్యనంది ) యస్ ఐఎ 3156 వంటి అధిక దిగుబడినిచ్చే కొర్ర రకాలు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా ఒక ఎకరానికి 1.5 నుంచి 2.0 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని సాళ్ళ

మధ్య 22.5 సెం.మీ. మరియు మొక్కల మధ్య 7.5 సెం.మీ దూరం ఉండేట్లు గొర్రుతో విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం:** పొలాన్ని ఆఖరి దుక్కి చేసేటప్పుడు 3 నుంచి 4 టన్నుల పశువుల ఎరువును ఎకరా పొలంలో వేసి కలియదున్నాలి. వర్షాధారంగా సాగు చేసినప్పుడు ఎకరాకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల అవసరం ఉంటుంది. కొర్రలను ఏకపంటగా మరియు మిశ్రమ పంటగా కూడా సాగుచేసుకోవచ్చు.

**కోత సమయం మరియు దిగుబడి:** కొర్రలు స్వల్పకాలిక పంట. విత్తిన 75-85 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు సగటున 7 నుండి 8 క్వింటాళ్ళ ధాన్యం దిగుబడితో పాటు 4 టన్నుల ఎండు చొప్ప దిగుబడి వస్తుంది. కంకులు ఎండినప్పుడు కంకులను విడిగా లేదా మొత్తం మొక్కను కొడవలితో కోయవచ్చు. ఈ పంటను జనవరిలో విత్తినచో సాధారణంగా ఏప్రిల్ వరకు కోతకొస్తుంది.

**సస్యరక్షణ :**

**వెర్రికంకి తెగులు:** కొర్ర పంటలో అధికంగా వచ్చే వ్యాధి. వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు లేత మొక్కల ఆకుల అడుగు భాగాన తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్‌తో విత్తనశుద్ధి చేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకిన మొక్కలు 5% మించి ఉన్నట్లయితే మెటలాక్సిల్ 8% + మాంకోజెబ్ 64% డబ్ల్యుపి 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**త్రుప్పు మరియు అగ్గి తెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్కల ఆకులపై మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు ఎక్కువగా ఆశించినప్పుడు లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**గులాబి రంగు పురుగు లేదా కాండం తొలుచు పురుగు !**

పంటలో ఈ పురుగు కాండాన్ని తొలిచి ఈ పైరుని నష్ట పరుస్తుంది. ఈ పురుగు ఆశించినట్లయితే దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8309958887**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. మార్చి, 2026 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 05.03.2026 | వ్యవసాయ రంగంలో మొబైల్ అనువర్తనాలు - వాటి ఉపయోగాలు | డా॥ పి. అర్చన, శాస్త్రవేత్త (వ్యవసాయ విస్తరణ)<br>తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మహబూబ్‌నగర్, ఫోన్ నెం.: 9666150842 |
| 12.03.2026 | రబీ జొన్నలో సమగ్ర పోషక యాజమాన్యం | శ్రీమతి కె. స్వాతి, శాస్త్రవేత్త (అగ్రానమి)<br>వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్, ఫోన్ నెం.: 8374601360 |
| 19.03.2026 | సమగ్ర వ్యవసాయంలో సూచనలు | డా॥ కె. శ్రీధర్, శాస్త్రవేత్త (అగ్రానమి)<br>ఏఐసిఆర్‌పి ఆన్ ఐ.ఎఫ్.ఎస్. యూనిట్, రాజేంద్రనగర్,<br>ఫోన్ నెం.: 9948735896 |
| 26.03.2026 | వేసవి పంటల్లో ఎరువుల యాజమాన్యం | డా॥ జె.ఎస్. సుధారాణి, సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమి)<br>ఎలక్ట్రానిక్ వింగ్, ఏఆర్ఐ, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9550526096 |

# నువ్వుల విత్తనోత్పత్తి – రైతులకు మార్గనిర్దేశం

డా॥ ఆకుల దినేష్ మరియు డా॥ కె. సుప్రియ

వ్యవసాయ పరిశోధన స్థానం, ముధోల్, నిర్మల్







మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, నీటి ఎద్దడిని తట్టుకుని వేసవిలో సాగు చేసే నూనెగింజ పంటలలో ప్రధానమైంది నువ్వు పంట. భారతదేశంలో సాగు విస్తీర్ణం పరంగా నువ్వుల సాగు మూడవ స్థానంలో, అలాగే మొత్తం నూనెగింజల ఉత్పత్తిలో నాల్గవ స్థానంలో ఉంది. తెలంగాణలో ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, మెదక్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇది ప్రధాన పంటగా సాగు చేయబడుతోంది. తక్కువ పెట్టుబడి, స్వల్ప కాలపరిమితి, మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్ మరియు ఎగుమతి అవకాశాలు నువ్వులను అత్యంత లాభదాయక పంటగా మార్చాయి. నువ్వు పంటలో విత్తన మోతాదు చాలా తక్కువగా (ఎకరాకు 2.5 కిలోలు) మరియు అత్యధిక విత్తన గుణకార నిష్పత్తి (1:250) ఉన్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో విత్తనోత్పత్తి ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల రకపు మార్పిడి రేటు మరియు విత్తన మార్పిడి రేటు 10% కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. నాణ్యమైన విత్తనోత్పత్తిని మెరుగుపరచడం ద్వారా రైతులకు విత్తనాల లభ్యత పెరగడమే కాకుండా, పాత రకాల స్థానంలో అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలు సాగు చేసేలా ప్రోత్సహించి నికర ఆదాయం పెంచవచ్చు. నువ్వు పంటలో అధిక దిగుబడి మరియు నాణ్యమైన విత్తనోత్పత్తి, క్రింది అంశాలపైన ఆధారపడి ఉంటుంది.

**అనువైన ప్రాంతాలు:** మొక్కల యొక్క జన్యు లక్షణాలు స్పష్టంగా కనిపించే నేల మరియు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న చోట విత్తనోత్పత్తి చేపట్టాలి. నీటి పారుదల సౌకర్యం ఉండి, పురుగులు మరియు తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకోవాలి. ముఖ్యంగా విత్తనాల ద్వారా వ్యాపించే తెగుళ్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో విత్తనోత్పత్తి చేయకూడదు.

**జన్యు మరియు భౌతిక స్వచ్ఛత నిర్వహణ:** నువ్వు విత్తనాలు పరిమాణంలో చాలా చిన్నవిగా, తేలికగా ఉండటమే కాకుండా, కాయలు పగిలే స్వభావం కలిగి ఉండటం వల్ల ఇతర రకాలతో త్వరగా కలిసే ప్రమాదం ఉంది. దీనిని నివారించడానికి విత్తనోత్పత్తి చేసే క్షేత్రాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు, గత పంట కాలంలో అదే పంట సాగు చేసి ఉండకూడదు. విత్తనాలను ఎల్లప్పుడూ గుర్తింపు పొందిన సంస్థల నుండే సేకరించాలి మరియు పరపరాగ సంపర్కాన్ని అరికట్టడానికి వివిధ విత్తన రకాల మధ్య సూచించిన కనీస దూరాన్ని పాటించి సకాలములో బెరుకులను ఏరివేయడం ద్వార రకం యొక్క జన్యు మరియు భౌతిక స్వచ్ఛతను కాపాడవచ్చు.

**వేర్పాటు దూరం:** మొక్కల యొక్క స్వచ్ఛతను కాపాడటానికి ఇతర నువ్వుల పంట నుండి పునాది విత్తన తరగతికి 100 మీటర్లు అలాగే ధ్రువీకరణ విత్తనానికి 50 మీటర్ల కనీస దూరం పాటించాలి.

**బెరుకుల ఏరివేత:** రకపు లక్షణాలకు భిన్నంగా ఉన్న మొక్కలను (బెరుకులు) వివిధ దశల్లో గుర్తించి తొలగించాలి:

**శాఖీయ దశ:** మొక్క ఎత్తు, ఆకు పరిమాణం, ఆకారం మరియు ఆకుల అంచుల ఆధారంగా భిన్నంగా ఉన్నవాటిని తొలగించాలి.

**పూతకు ముందు దశ:** కొమ్మల తీరు, ఎత్తు, పూత మొదలయ్యే సమయం మరియు కాండంపై ఉండే మెత్తని వెంట్రుకల వంటి లక్షణాలను బట్టి వేరు చేయాలి.

**పూత దశ:** ఆలస్యంగా లేదా ముందుగా పూతకు వచ్చే మొక్కలను, పూల రంగును బట్టి గుర్తించాలి.

**కాయ దశ:** కాయలో ఉండే గదుల సంఖ్య, పొడవు, ఆకారం మరియు కాయపై ఉండే వెంట్రుకల వంటి లక్షణాలను బట్టి బెరుకులను తొలగించాలి.

అన్ని దశల్లోనూ వెర్రి తెగులు సోకిన మొక్కలను వెంటనే పీకి నాశనం చేయాలి.

**విత్తే పద్ధతి:** ఒక ఎకరాకు సుమారు 2.5 కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తనం సమానంగా పడటం కోసం ఒక వంతు విత్తనానికి మూడు వంతుల ఇసుకను కలిపి గొర్రు సాయంతో వరుసల్లో విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి. వరుసలలో విత్తుకోవటం ద్వారా బెరుకుల ఏరివేత సులభంగా ఉంటుంది.

**తెలంగాణ ప్రాంతానికి అధిక దిగుబడినిచ్చే అనువైన నువ్వుల రకాలు:** నేల స్వభావం మరియు తెగుళ్ల ఉధృతిని బట్టి రైతులు రకాలను ఎంచుకోవాలి.

- **కాండం కుళ్లు తెగులుకు:** శ్వేత, రాజేశ్వరి.
- **వెర్రి తెగులుకు:** హేమ, చందన.
- **అధిక దిగుబడినిచ్చే కొత్త రకాలు (పిజెటిఏయు):** జెసిఎస్-1020 (జగిత్యాల తిల్-1), జెసిఎస్-2454 (జగిత్యాల తిల్-2), జెసిఎస్-38020 (తెలంగాణ తిల్-1). ఇవి బూడిద, ఆకుమచ్చ మరియు వెర్రి తెగుళ్లను తట్టుకుంటాయి.

విత్తనోత్పత్తి క్షేత్రంలో మేలైన యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రకం యొక్క లక్షణాలు స్పష్టంగా కనపడతాయి.

విత్తనం యొక్క నాణ్యతను బట్టి పునాది మరియు ధ్రువీకరించబడిన విత్తనాలకు ఉండాల్సిన కనీస మరియు గరిష్ట పరిమితులు.

**ఆరబెట్టడం:** నువ్వుల సాగులో కాయలు పగిలి విత్తనాలు రాలిపోవడం అతిపెద్ద సమస్య. కాబట్టి మొక్కలను కోసి కట్టలుగా కట్టి, టార్పాలిన్ మీద 3-5 రోజులు వాల్చి, ఆకులు ఎండి రాలిపోయే వరకు ఉంచాలి.

**నూర్పిడి:** టార్పాలిన్ మీద కర్రలతో సున్నితంగా కొట్టి విత్తనాలను వేరు చేయాలి. విత్తనాలను 2-3 రోజులు ఎండలో ఆరబెట్టాలి. విత్తనాలను తూర్పారబట్టి, జల్లెడ పట్టాలి. రకాన్ని బట్టి అల్యూమినియం విండో స్క్రీన్స్ లేదా వివిధ మెష్ సైజులను వాడి లావుపాటి విత్తనాలను వేరు చేయాలి.

**నిల్వ పద్ధతులు:** విత్తనంలో తేమ శాతం 7-8% ఉన్నప్పుడు పాలిథిన్ లైనింగ్ సంచుల్లో నిల్వ చేయాలి. దీర్ఘకాలిక నిల్వ కోసం తేమ 6% కంటే తక్కువ ఉండాలి. సుమారు 50% సాపేక్ష ఆర్ద్రత మరియు చల్లని వాతావరణంలో నిల్వ చేయడం శ్రేయస్కరం.

### విత్తన నాణ్యత పరీక్ష మరియు సవాళ్లు

**గ్రో-అవుట్ టెస్ట్:** విత్తన స్వచ్ఛతను నిర్ధారించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు.

- సేకరించిన నమూనా నుండి 800 మొక్కలను పెంచి పరిశీలించాలి.
- నువ్వుల సాగులో అనుమతించదగిన అన్య రకపు మొక్కల (ఆఫ్ టైప్స్) గరిష్ట పరిమితి కేవలం 0.5% మాత్రమే. అంటే 800 మొక్కల్లో 4 కంటే ఎక్కువ ఇతర రకపు మొక్కలు ఉండకూడదు.

| అంశం | పునాది విత్తనం | ధ్రువీకరించబడిన విత్తనం |
|---|---|---|
| నాణ్యమైన విత్తనం (కనీసం) | 97.0% | 97.0% |
| జడ పదార్థం (గరిష్టం) | 3.0% | 3.0% |
| ఇతర పంట విత్తనాలు (గరిష్టం) | 10/కిలో | 20/కిలో |
| కలుపు విత్తనాలు (గరిష్టం) | 10/కిలో | 20/కిలో |
| ఇతర రకపు విత్తనాలు (గరిష్టం) | 10/కిలో | 20/కిలో |
| మొలక శాతం (కనీసం) | 80% | 80% |
| తేమ శాతం (గరిష్టం) | 9.0% | 9.0% |
| తేమ చొరబడని సంచులలో (గరిష్టం) | 5.0% | 5.0% |

### కోత మరియు కోత అనంతర పద్ధతులు

**కోత సమయం:** మొక్కపై ఉన్న అన్ని కాయలు ఒకేసారి పక్వానికి రావు. కింద ఉన్న కాయలు ముందుగా ముదిరితే, పై భాగంలో ఉన్నవి ఇంకా పచ్చిగానే ఉంటాయి. దీనివల్ల కోత సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. కింద నుంచి 70% కాయలు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగులోకి మారినప్పుడు కోయాలి.

పైన చెప్పబడిన పద్ధతులు సకాలంలో చేపట్టడం ద్వారా రైతులు నువ్వులలో అధిక దిగుబడి మరియు నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8985331641

# శనగ పంట కోత మరియు కోతానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ ఎం. మధు, డా॥ ఎ. వెంకట్ రెడ్డి, డా॥ జి. పద్మజ, డా॥ జి. శేషు, డా॥ కె. రుక్మిణి దేవి మరియు
డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్






తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో అధిక విస్తీర్ణంలో పండించే పంటల్లో శనగ పంట ఒకటి. తెలంగాణలో శనగ పంట సాధారణంగా విస్తీర్ణం 3.04 లక్షల ఎకరాలల్లో ఉండగా, ఈ సంవత్సరం 1.6 లక్షల ఎకరాలల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. కావున రైతులు పంట పక్వదశను గుర్తించి సకాలంలో పంట కోత కోసి కోతానంతరం మరియు తదుపరి నిల్వ సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అధిక నాణ్యమైన పంట దిగుబడి తద్వారా అధిక నికరాదాయాన్ని పొందవచ్చు.

### పంటకోత సమయం:

పంటను సరైన సమయంలో కోయడం ముఖ్యం. సాధారణంగా శనగ పంట పూత దశ నుండి 50-55 రోజుల్లో పరిపక్వతకు చెందుతుంది. పంట కోత లక్షణాలైన

- కాయలు ఆకుపచ్చ రంగు నుండి గోధుమ రంగుకు మారినప్పుడు.
- ఆకులు పసుపు బారి, పూర్తిగా రాలిపోయి, మొక్కంతా ఎండినప్పుడు పంట కోత చేపట్టవచ్చును.
- ఈ సమయంలో సకాలంలో కోత కోస్తే గింజ అధిక నాణ్యతను కలిగి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.
- పంటను కూలీలు లేదా కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడా కోయించవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ సామర్థ్యం కొరకు యంత్రాన్ని వాడాలి. వాడే ముందు యంత్రాన్ని శుభ్రపరచుకుంటే కల్తీల్ని నిరోధించవచ్చు.

కోత సమయంలో అధిక వర్షపాతం తేమ ఉన్నట్లైతే కీటకాలు మరియు శిలీంధ్రాలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

### కోతానంతరం విత్తనాలను నిల్వ చేయు సమయంలో చెడిపోవడానికి గల ముఖ్య కారణాలు:

- విత్తనంలో తేమ శాతం అధికంగా ఉండటం. సాధారణంగా కోత సమయంలో గింజల్లో 15-22% వరకు తేమ ఉంటుంది. అయితే నిల్వ చేసేటప్పుడు తేమను 10-12% కు తగ్గించి నిల్వ ఉంచాలి.
- నిల్వ చేసిన గదిలో తేమ, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం.
- పూర్తిగా శుభ్రం చేయకుండా విత్తనాలను నిల్వ చేయడం.

- నిల్వ సమయంలో వివిధ రకాలైన కీటకాలు మరియు శిలీంద్రాలు ఆశించడం వలన విత్తన నాణ్యత మరియు మొలక శాతం తగ్గడం జరుగుతుంది.
- పాత సంచులను సరిగ్గా శుభ్రం చేయకుండా వాడడం.

**విత్తనం నిల్వ సమయంలో ఆశించు చీడపీడలు - యాజమాన్య పద్ధతులు:**

**కీటకాలు:** నిల్వ సమయంలో వివిధ రకాల కీటకాలు ఆశించి నాణ్యతను తగ్గిస్తాయి. శనగ విత్తనాలను నిల్వలో పెంకు పురుగు (బ్రూచిడ్స్) అత్యధికంగా నష్టపరుస్తుంది. సాధారణంగా కాయ పరిపక్వత దశలోనే పెంకు పురుగు ఆశిస్తుంది. గింజల ద్వారా నిల్వ చేసే గోదాముల్లోకి ప్రవేశించి నష్టం కలుగజేస్తుంది. కాబట్టి కోతానంతరం గింజల్ని బాగా ఎండబెట్టాలి మరియు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ పురుగు గింజలపై గుండ్రని, తెల్లని గ్రుడ్లను పెడుతుంది. ఈ గ్రుడ్ల నుండి వచ్చిన పిల్ల పురుగులు గింజ లోపలి భాగాన్ని తినేసి రంధ్రాలను చేస్తాయి మరియు గింజలోనే కోశస్థ దశలో మారి, అందులో నుండి తల్లి పురుగులు బయటకు వస్తాయి.

**నివారణ చర్యలు:**

- అనాది కాలంగా విత్తనాలను నింపే సంచులలో వేప ఆకులు వేసేవారు. దీనితో కీటకాలు ఆశించకుండా గింజల్ని చాలా వరకు భద్రపరచవచ్చు.
- వేప గింజల పొడి 5 గ్రా. లేదా వేప నూనె 5 మి.లీ. కిలో విత్తనానికి కలిపి నిల్వ చేస్తే పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు.
- విత్తనం నిల్వ ఉంచే గదుల్లో పగుళ్ళు, రంధ్రాల్ని పూడ్చి సున్నం వేస్తే దాగి ఉన్న పురుగులు చనిపోతాయి.
- పాత సంచులు వాడే ముందు లీటరు నీటికి 10 మి.లీ. వేప ద్రావణం కలిపి పిచికారి చేసి వాడుకోవాలి. లేదా 5% వేప కషాయంలో ముంచి ఆరబెట్టిన తరువాత విత్తనాన్ని నింపుకోవాలి.

**శిలీంద్రాలు:**

శనగ నిల్వ సమయంలో వివిధ శిలీంద్రాలు ఆశించి గింజలపై తెల్లటి, పచ్చని లేదా నల్లటి బూజుగా ఏర్పడతాయి. దీని వలన గింజల నాణ్యత, రంగు, రుచిని కోల్పోతాయి. ఈ బూజు తెగులు మైకోటాక్సిన్ అనే విషపూరిత రసాయనాలను గింజల్లో విడుదల చేస్తాయి. ఈ గింజలు మనుషులు, పశువులకు హానికరం. క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు దారి తీస్తాయి.

**నివారణ చర్యలు:**

- గింజల్లో అధిక తేమ ఉన్నట్లైతే ఈ శిలీంద్రాలు ఎక్కువగా ఆశిస్తాయి. కాబట్టి గింజల్లో తేమ శాతం 9 కన్నా ఎక్కువ ఉండకుండా ఆరబెట్టాలి.
- కీటకాలు, ఎలుకలు ఆశించకుండా జాగ్రత్త పడాలి. ఎందుకంటే ఇవి తిన్న గింజల్లో శిలీంద్రాలు ఎక్కువగా ఆశిస్తాయి.
- విత్తనం కొరకు భద్రపరచే గింజల్ని థైరమ్ / కాప్టాన్ 2.5 గ్రా. కిలో విత్తనానికి చొప్పున కలిపి ఆరబెట్టుకుని నిల్వ చేసుకోవాలి.

**ఎలుకలు:**

ఎలుకలు నిల్వ చేసిన గింజల్ని తినడంతోపాటు వాటి మలం, మూత్రంతో గింజల్ని మలినం చేస్తాయి. తద్వారా గింజల నాణ్యత తగ్గిపోయి తినడానికి పనికిరావు. నిల్వ ఉంచిన గోనె సంచులను, గాదెలను కొరికి కూడా నష్టం చేస్తాయి.

**నివారణ చర్యలు:**

- గోదామును శుభ్రంగా ఉంచాలి.
- గోదాముల్లో రంధ్రాలు / పగుళ్ళు లేకుండా మూసేయాలి.
- ఎరలు / బోన్లు సహాయంతో వాటిని పట్టి నాశనం చేయాలి.
- నింపిన బస్తాలను నేలపైనే కాకుండా కొంచెం ఎత్తైన చెక్క బల్లలపై ఏర్పాటు చేయాలి.
- త్వరగా విష ప్రభావం చూపించే జింక్ ఫాస్పైడ్ లేదా నిదానంగా పనిచేసే బ్రోమోడయోలోన్ ఉపయోగించి 40-60% ఎలుకలను 3-4 రోజుల్లో చంపవచ్చు.

రైతులు శనగ ఉత్పత్తిని నిల్వ చేసేటప్పుడు తేమ శాతం ఎప్పటికప్పుడు గమనించి మధ్యలో ఆరబెట్టుకుంటూ జాగ్రత్త పడాలి. తద్వారా మార్కెట్‌లో అధిక ధర లభిస్తుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9912522394

# ప్రత్తి పంట అనంతరం మరియు జిన్నింగ్ మిల్లులలో చేపట్టవలసిన గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులు

డి. గౌతమి, డా॥ కె. రాజశేఖర్, డా॥ జి. ప్రవీణ్ కుమార్, డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, డా॥ డి. మోహన్ దాస్,
డా॥ శ్రీధర్ చౌహాన్ మరియు బి. రఘుపతి

వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్





**ప్రత్తి పంట అనంతరం చేపట్టవలసిన గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులు:-**

- నీటి వసతి ఉన్నప్పటికీ ప్రత్తి పంటను ఆరు నెలలకు మించి పొడిగించకుండా తీసివేయాలి. పంట కాలము పొడిగించుట ద్వారా రాబోయే పంటల్లో పురుగు ఉధృతి తొలిదశలోనే ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది.
- నీటి వసతి ఉన్న చోట రెండో పంటగా ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకోవడం వల్ల పంటమార్పిడి జరగడమే కాకుండా ప్రత్తిలో వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఆదాయం పొందవచ్చు.
- పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలు, మేకలు, పశువులను తోలి మేపాలి.
- ప్రత్తి మోళ్ళను ష్రెడ్డరుతో గాని, రోటావేటరుతో గాని, భూమిలో కలియదున్నాలి లేదా ప్రత్తి మోళ్ళను దగ్గరలో ఉన్న కాటన్ బ్రికెట్ పరిశ్రమకు తరలించాలి.
- ప్రత్తి మోళ్ళను ఇళ్ల వద్ద పొయ్యిలో వాడేందుకు నిల్వ చేయకూడదు.
- ప్రత్తి తీసిన తర్వాత ఎండిన మోళ్ళను, విచ్చుకోని కాయలను పీకివేసి తగులబెట్టి ఆ తరువాత భూమిలో కలియదున్నడం ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చును.
- ప్రత్తి మోళ్ళను తీసివేసిన తర్వాత నీటి వసతి ఉన్నచోట భూమికి ఒకసారి బాగా నీరు ఇచ్చినట్లయితే భూమి లోపల ఉండే పురుగు లార్వాలు కోశస్థ దశలు నశిస్తాయి.
- తదుపరి సీజన్‌లో విత్తడానికి జిన్నింగ్ మిల్లుల నుండి వచ్చిన కలుషిత విత్తనాలను ఉపయోగించకూడదు. ధృవీకరించి, శుద్ధి చేసిన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి.
- కాలువ ప్రక్కన మరియు పొలం పరిసరాలల్లో స్వయంగా మొలిచిన ప్రత్తి మొక్కలను పూర్తిగా తొలగించాలి. ఇవి పురుగుకు ప్రత్యామ్నాయ ఆతిథ్య మొక్కలుగా పని చేసి సంవత్సరమంతా పురుగు ఉధృతికి తోడ్పడతాయి.
- ప్రత్తి తీసిన తర్వాత కూడా పొలంలో ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలు పెట్టడం ద్వారా మగ పురుగులను ఆకర్షించి వాటి జనాభాను తగ్గించవచ్చు మరియు తదుపరి దశలను అంచనా వేయవచ్చు.
- పంట కోత అనంతరం పొలంలో మిగిలిన ప్రత్తి కాయలు, చెత్తలో ఉన్న పురుగుల యొక్క కోశస్థ దశల నుండి పెద్ద పురుగులు బయటకు వస్తాయి. ఈ దశలో పొలంలో ఒక ఎకరానికి ఒక కాంతి ఎర (లైట్ ట్రాప్) ఏర్పాటు చేసి పెద్ద రెక్కల పురుగులను ఆకర్షింపచేసి నాశనం చేయవచ్చు. ఈ కాంతి ఎరలు రాత్రి వేళల్లో 8-11 గం॥ సమయంలో ఏర్పాటు చేయాలి. ఈ కాంతి ఎర కింద నీరు + కిరోసిన్ / సబ్బు

ద్రావణం ఉంచితే కాంతికి పురుగులు ఆకర్షింపబడి ఆ సబ్బు ద్రావణంలో పడిపోయి చనిపోతాయి.

**ప్రత్తి పంట తీసిన తర్వాత జిన్నింగ్ మిల్లులలో చేపట్టవలసిన గులాబిరంగు పురుగు యాజమాన్య పద్ధతులు:**

ప్రత్తి పంటలో ప్రధానమైన కీటకాల్లో గులాబిరంగు పురుగు ఒకటి. ఈ కీటకం ప్రత్తి గుళికలను లోపల నుంచే దెబ్బతీసి దిగుబడి మరియు నాణ్యతను తగ్గిస్తాయి. పంట కోత తర్వాత కూడా ఈ కీటకం గింజలలో మిగిలిన గుళికలలో జీవించి ఉండి జిన్నింగ్ మిల్లుల్లో విస్తరించే ప్రమాదం ఉంది. అందువల్ల జిన్నింగ్ మిల్లుల వద్ద సరైన శుభ్రత, నిల్వ నిర్వహణ మరియు నియంత్రణ చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం.

- మొదటగా పంట కోత తర్వాత శుభ్రత నిర్వహణ చాలా ముఖ్యమైనది. జిన్నింగ్ యంత్రాలు, నేల, గోడల మూలలు, నిల్వ గోదాములు, రవాణా బెల్టులు వంటి ప్రదేశాలలో పేరుకుపోయిన ప్రత్తి అవశేషాలు, పాడైన గింజలు, ధూళి మొదలైనవన్నీ సేకరించి దహనం చేయడం లేదా లోతుగా పూడ్చి పెట్టడం ద్వారా పురుగుల జీవితచక్రం నిలిచిపోతుంది. ప్రత్తి పంట కాలం (సీజన్) ముగిసిన వెంటనే మిల్లును పూర్తిగా శుభ్రపరిచి డిస్ఇన్‌ఫెక్షన్ చేయడం ద్వారా కీటక జనాభాను గణనీయంగా తగ్గించవచ్చు.
- గింజ నిల్వ మరియు రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సంక్రమిత గింజలను ఆరోగ్యకరమైన గింజలతో కలపకూడదు. నిల్వ చేసే గోదాములు, ఎండ, గాలి ఆడేలా ఉండాలి. తేమ ఎక్కువగా ఉంటే పురుగుల పెరుగుదల వేగంగా జరుగుతుంది. కాబట్టి తేమశాతం తక్కువగా ఉంచడం, గోదాములను క్రమం తప్పకుండా పరిశీలించడం అవసరం.

**హెర్మెటిక్ నిల్వ విధానం:** (గాలి ప్రవేశం తగ్గించే నిల్వ) కూడా చాలా ప్రభావవంతమైనది. గాలి చొరబడని కవర్లు లేదా సీల్డ్ గోదాములు ఉపయోగించడం వల్ల ఆక్సిజన్ తగ్గి లార్వా మరియు పురుగులు జీవించలేవు. ఇది రసాయన వినియోగం తగ్గించే పర్యావరణ హితమైన పద్ధతి.

- లింగాకర్షక బుట్టలను జిన్నింగ్ మిల్లుల వద్ద అమర్చడం ద్వారా మగ పురుగులను ఆకర్షించి వాటి సంఖ్యను తగ్గించవచ్చు. ఇది కీటక జనాభాను అంచనా వేయడంలో కూడా సహాయపడుతుంది. అదే విధంగా సంక్రమిత గింజలను వేడి చికిత్స (హీట్ ట్రీట్‌మెంట్) చేయడం ద్వారా లోపల ఉన్న పురుగులు నశిస్తాయి.
- రసాయన నియంత్రణ అవసరమైనప్పుడు మాత్రమే జాగ్రత్తగా ఉపయోగించాలి. గోదాములలో అనుమతించబడిన ఫ్యూమిగెంట్లు లేదా నిల్వ కీటక నాశకాలు నిపుణుల సూచన మేరకు వినియోగించాలి. సాధారణంగా అల్యూమినియం ఫాస్ఫైడ్ వంటి ఫ్యూమిగేషన్ మందులు ఉపయోగిస్తారు. కానీ ఇవి శిక్షణ పొందిన వ్యక్తుల పర్యవేక్షణలోనే చేయాలి. భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి.
- నిల్వ కాలం తగ్గించడం మరియు త్వరిత ప్రాసెసింగ్ కూడా నిర్మూలనలో సహాయపడుతుంది. ప్రత్తిని ఎక్కువకాలం నిల్వ ఉంచితే కీటకం అభివృద్ధి చెందే అవకాశం పెరుగుతుంది. కాబట్టి పంట కోత తరువాత వీలైనంత త్వరగా జిన్నింగ్ మరియు ప్రాసెసింగ్ పూర్తి చేయడం ఉత్తమం.
- చివరగా సమగ్ర నియంత్రణ విధానం (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మెనేజ్‌మెంట్) ను అనుసరించడం ద్వారా గులాబిరంగు పురుగును జిన్నింగ్ మిల్లుల్లో సమర్ధవంతంగా నిర్మూలించవచ్చు. పరిశుభ్రత, తేమ నియంత్రణ, హెర్మెటిక్ నిల్వ, లింగాకర్షక బుట్టలు అవసరమైనప్పుడు ఫ్యూమిగేషన్ మరియు నిరంతర పర్యవేక్షణ. ఈ చర్యలు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యమవుతుంది. ఈ విధానాలను క్రమంగా అమలు చేస్తే జిన్నింగ్ మిల్లుల్లో గులాబి రంగు పురుగు సమస్యను పూర్తిగా తగ్గించి, తదుపరి ప్రత్తి పంటను కూడా రక్షించవచ్చు.





# చెఱకు సాగు - నేలల లక్షణాలు మరియు ఎంపిక

డా॥ ఫిర్దోస్ సహానా, డా॥ రమ్య రాథోడ్, డా॥ పరమేశ్వరి, డా॥ ఎమ్. సాయి చరణ్, డా॥ కృష్ణ చైతన్య,
డా॥ మంజు భార్గవి, డా॥ జి. రాకేష్, డా॥ రమేష్ మరియు డా॥ కె. పవన్ చంద్రా రెడ్డి
వ్యవసాయ పాలిటెక్నిక్, రుద్రూర్





చెఱకులో అధిక దిగుబడి, అత్యధిక పంచదార దిగుబడి ప్రధానంగా భూభౌతిక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి. కాబట్టి రైతాంగం చెఱకు నాటటానికి శ్రేష్టమైన భూములను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం వుంది. చెఱకును మన రాష్ట్రంలో డిసెంబర్, జనవరి నుండి నాటడం ప్రారంభిస్తారు. సహజంగా చెఱకు నాటిన 10 నెలల నుంచి 14 నెలలలోపు చెఱకు నరకడం పూర్తి చేయాలి. ఇది ఎక్సాలీ పంటకు మాత్రమే, అడ్సాలీ పంట కాల పరిమితి సుమారు 18 నెలలు. తక్కువ కాల వ్యవధిలో ఆదాయం చేతికి రావడంపై మక్కువ కనబరిచే రైతాంగం అడ్సాలీ పంట విధానాన్ని పూర్తిగా మరచిపోయారనవచ్చు. ప్రస్తుతం పరిశోధనాలయాలలో రూపొందించబడుతున్న వంగడాలు కూడా అడ్సాలీ పంటకు అనుకూలంగా లేవు. ఎక్కువ రోజులలో పక్వానికి వచ్చే వంగడాల పట్ల రైతులు మక్కువ కనబరచకపోవటం వల్ల తక్కువ కాలపరిమితి వంగడాల రూపకల్పనకే శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. 9 నెలల వ్యవధిలో పక్వానికి వచ్చే వంగడాలు ఇప్పటికే చాలా విడుదల చేయబడి సాగులో ఉన్నాయి. అలా నిర్ధిష్ట వ్యవధిలో ఆయా వంగడాలు పక్వానికి రావాలంటే నీటి తడులు, ఎరువుల వేయటం, మురుగునీరు పారుదల వసతి సక్రమంగా ఉండాలి. వీటన్నింటినీ మించి భూభౌతిక స్థితి మంచిదై ఉండాలి.

నీటి వసతి ఉన్న భూములన్నీ చెఱకు సాగుకు అనుకూలంగా ఉండవన్న విషయం రైతులు గుర్తుంచుకోవాలి. ఆమ్లగుణాలు, క్షారగుణాలు అధికంగా ఉన్న భూములు చెఱకు సాగుకు పనికిరావు. అలాంటి లక్షణాలున్న భూములలో చెఱకు నాటినప్పుడు మొలకలు వచ్చినా అవి క్రమంగా చని పోతుంటాయి. సంవత్సరం అంతా నామమాత్రంగా చెఱకు పెరిగినా కార్శి (పిలక) దిగుబడి గణనీయంగా తగ్గడం సహజం. కొన్ని సందర్భాలలో కార్శిని పూర్తిగా తీసేసి మరోపైరు వేసుకోవాల్సిన దుస్థితి కూడా దాపురిస్తుంది.

కాబట్టి ఆమ్ల, క్షారగుణాలు ఎక్కువగా వున్న భూములను చెఱకు సాగుకు దూరంగా వుంచడం ఉత్తమం.

భూభౌతిక పరిస్థితి, భూ రసాయనిక గుణాలపై చెఱకు దిగుబడి ఆధారపడి వుంటుంది. భూభౌతిక స్థితి అంటే మట్టిలోని భౌతిక గుణగణాలు. భూమిలో చెఱకు వేర్లు త్వరగా పెరుగుతూ, లోపలికి చొచ్చుకు పోవడానికి అవకాశం కల్పించాలి. అలా అవకాశం కల్పించడానికి పరిమాణరీత్యా సగభాగం మట్టికణాలు వుంటే మిగిలిన సగభాగం ఖాళీగా ఉండాలి. ఇలా మట్టి కణాల మధ్య ఖాళీ ఉన్నప్పుడు వేర్లు త్వరగా పెరుగుతూ నీటిని, గాలిని అవసరం మేరకు స్వీకరించడానికి అనువుగా వుంటుంది. అలా జరిగినప్పుడు మొక్కల పెరుగుదల సంతృప్తికరంగా ఉంటుంది. భూభౌతిక పరిస్థితి అలా లేకపోతే వేర్ల పెరుగుదలకు అవరోధం ఏర్పడుతుంది.

చెఱకు సాగుకు కేటాయించే భూములను మూడు రకాలుగా చెప్పవచ్చు. అవి నల్లరేగడి నేలలు, ఎర్రనేలలు, ఇసుక నేలలు, మెరక, తీర ప్రాంతంలోని ఉప్పు నేలల్లో కూడా చెఱకు సాగు చేస్తూనే ఉన్నారు.

### నల్లరేగడి నేలలు :

డెల్టా ప్రాంతంలో వరి పంట తర్వాత చెఱకు నాటే భూములు దాదాపు ఈ నల్లరేగడి కోవకు చెందినవే. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతుంది కూడా ఈ భూముల్లోనే. ఈ భూములు చెఱకు దిగుబడికి ఎంత శ్రేష్టమైనవిగా చెప్పుకుంటామో, రైతు శ్రద్ధ వహించని సందర్భాలలో అంతకు మించి నష్టం కలిగిస్తాయి. ఈ భూములు ఎక్కువ తేమను నిల్వచేయగల గుణం కలిగి ఉంటాయి. వేసవిలో నీటితడులు ఆలస్యమైనా నీటి ఎద్దడిని కొంతమేరకు తట్టుకునే స్వభావం కలిగి వుంటాయి. నల్లరేగడి భూములలో కొన్ని చోట్ల ఒండ్రు మట్టి కలిసి వుంటుంది. అలా కలిసి ఉన్న భూములు చెఱకు సాగుకు శ్రేష్టమైనవి. కేవలం రేగడి భూములైనప్పుడు భూమి చట్టుకుపోయి ఉంటుంది. అలా చట్టుకుపోవడానికి రెండు కారణాలు ప్రధానంగా చెప్పవచ్చు. వరినాట్లు జరిగినప్పటి నుంచి వరికోతలు వచ్చేవరకు ఆ భూములలో నీరు నిల్వ వుంటుంది. అలా నిల్వ ఉన్నప్పుడు భూమి తోడుకుపోతుంది. డెల్టా ప్రాంతంలో చాలాచోట్ల ట్రాక్టర్‌తో దమ్ముచేసిన అనంతరం వరినాట్లు వేయడం జరుగుతుంది. అలా వేయడం వల్ల కూడా భూమి తోడుకుపోతుంది. ఇలా తోడుకుపోయిన భూములలో ఏ పైరు వేసినా భూమి లోపలికి వేర్లు చొచ్చుకుపోయే అవకాశం తగ్గుతుంది. నీరు త్వరగా ఇంకిపోయే గుణం సహజంగా తగ్గుతుంది. భూమి త్వరగా అరుదలకు వచ్చినప్పుడే వేర్లు సజావుగా గాలిని పీల్చుకుని మొక్కలకు అందించగలుగుతాయి.

### ఎర్రనేలలు :

ఎర్రనేలలు కూడా చెఱకు సాగుకు శ్రేష్టమైనవే. ఈ ఎర్రనేలలు కొన్ని ప్రాంతాలలో మట్టి ఇసుకతో కలిసి గరప స్వభావం కలిగి ఉంటాయి. కొన్నిచోట్ల ఎర్రనేలల పై పొర గట్టి పడిపోయి వేర్లు పెరుగుటకు అవకాశం తగ్గిస్తుంది. నీరును నిల్వ చేసుకునే శక్తి తక్కువగా ఉంటుంది. అలా జరిగినప్పుడు చెఱకు దిగుబడి తగ్గిపోవటం సహజం.

ఇలా గట్టిపడి ఉన్న భూములలో చెఱకు నాటుటకు నిర్ణయించుకున్న రైతాంగం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వరి తాలుగాని, ఊకగాని ఏది అందుబాటులో ఉంటే అది దుక్కి సమయంలో వేయాలి. కొన్నిచోట్ల వేరుశనగ పొట్టు రైతుల వద్ద ఉంటుంది. దాన్ని కూడా నలగగొట్టి దుక్కిలో వేయవచ్చు. నలగగొట్టడానికి వీలు కానప్పుడు పొట్టును వేసినా ప్రయోజనకరమే. ఇలా చేయడం వల్ల భూమిలో గుల్లతనం ఏర్పడి, వేర్లు త్వరగా చొచ్చుకుపోవడానికి వీలు ఏర్పడుతుంది.

### ఇసుక నేలలు :

లంక భూముల్లో ఇసుక పొరలు ఎక్కువగా ఉంటాయి. వీటినే ఇసుక నేలలు అని పిలుస్తారు. ఈ భూముల్లో చెఱకు నాటవచ్చు, మంచి పెరుగుదల వుంటుంది. నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటుంది. ఇసుక నేల గుల్లగా ఉండటం వల్ల నీరు చాలా త్వరగా భూమి లోపలి పొరలకు చేరి పోతుంటుంది. నీరు పారించిన కొన్ని గంటల వ్యవధిలో పై పొరల్లో తేమ లేకుండా పోతుంది. అందువల్ల ఎక్కువసార్లు నీరు అందించాల్సిన అవసరం ఏర్పడుతుంది. పుష్కలంగా నీటి వనరులున్నప్పుడు మాత్రమే ఇసుక నేలల్లో చెఱకు నాటడం మంచిది. నీటితో పాటు పోషకాలు కూడా భూమిలోపలి పొరల్లోకి వెళ్లి వ్రేర్లకు అందకుండా పోతాయి. కాబట్టి ఎరువులు ఎక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

చెఱకు పెరుగుదల, పంచదార దిగుబడి భూమి యొక్క రసాయన స్వభావంపై ఆధారపడి ఉంటుంది. మట్టిలో లవణాల పరిమితి ఏమిటి? మట్టి ఆమ్లగుణం కలిగి ఉందా? క్షారగుణం కలిగి ఉందా? పైరుకు అవసరమయ్యే పోషక పదార్థాలు మట్టిలో ఏ మేరకు ఉన్నాయి? ఇత్యాధి విషయాలు భూమి యొక్క రసాయన స్వభావాన్ని స్పష్టపరుస్తాయి.

మట్టిలో లవణముల పాలు ఎక్కువగా ఉన్నప్పుడు పొటాషియం, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాలు పైరుకు అందవు. అధిక లవణ స్వభావం గల భూముల్లో చెఱకు పండిస్తే దిగుబడి, రస నాణ్యత దెబ్బతింటుంది. ఈ లవణ గుణాలను తగ్గించిన తదుపరి చెఱకు సాగుకు ప్రయత్నించడం మంచిది.

ఆమ్లగుణాలు గల భూమిలో చెఱకు దిగుబడి బాగున్నప్పటికీ రసనాణ్యత దెబ్బతింటుంది. అందువల్ల పంచదార దిగుబడి తగ్గుతుంది. ఆమ్లగుణాలను తగ్గించిన తర్వాతనే ఆ భూముల్లో చెఱకు నాటాలి.

జిప్సం వాడకం ద్వారాను, సూపర్ ఫాస్ఫేట్, అమ్మోనియం నైట్రేటు లాంటివి వాడటం ద్వారా పై అనర్థాలను సవరించి భూ స్వభావంలో మార్పు తీసుకురావడానికి వీలుంది. అలాగే ఫ్యాక్టరీల నుంచి ఫిల్టరు కేకు తెచ్చి దుక్కి సమయంలో వేయడం మంచిది. మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయించి భూసార పరీక్షా కేంద్రాలిచ్చే సలహాలను, సూచనలను పాటించి ఆయా నేలల ఉత్పాదకశక్తిని పెంచుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9182375732**

# దశరథ గడ్డి సాగు - యాజమాన్యం

డా॥ డి. పద్మజ, డా॥ ఎస్. శ్రీనివాస రావు, డా॥ జె. అరుణ కుమారి,
డా॥ టి. శశికళ మరియు డా॥ ఆర్. సుశీల

ఏ.ఆర్.ఐ, రాజేంద్రనగర్, హైదరాబాద్



**దశరథ గడ్డి సాగు విధానం:** పశుగ్రాస పంటలలో పప్పుజాతి పశుగ్రాసాలు ముఖ్యమైనవి. దీనిలో మాంసకృతులు శాతం ఎక్కువ (15-18%). దీనితో పాటు విటమిన్లు, భాస్వరం, కాల్షియం ఉంటాయి. దీనిని పప్పుజాతి పశుగ్రాసాలకు ప్రత్యామ్నాయంగా కూడా సాగు చేయవచ్చును. ఈ పశుగ్రాస పంటను ఇతర పశుగ్రాసాలతో కలిపి మేతగా వేసినప్పుడు పాలదిగుబడి కూడా పెరుగుతుంది. ఈ మేతను పశువులు ఇష్టంగా తింటాయి.

దశరథగడ్డి బహువార్షిక పప్పుజాతి పంట. దీనిని హెడ్జ్ల్యూసర్న్ అని కూడా అంటారు. ఈ మొక్కలు నిలువుగా పెరిగి చాలా కొమ్మలు నిట్టనిలువుగా ఏర్పడి పలుకోతలు వచ్చే బహువార్షిక పప్పుజాతి పంట. ఒకసారి విత్తుకుంటే 3-5 ఏళ్ళ వరకు ఉంటుంది. ఆకులు లేతగా చిన్నగా ఉంటాయి. పూలు తెల్లగా ఉంటాయి. కాయలు చిన్నగా, పొడవుగా సన్నగా ఉంటాయి. అన్ని కాలాలల్లో, అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చును.

**విత్తన మోతాదు:** ఎకరాకు 8-10 కిలోలు మిశ్రమ పంటగా వేసినప్పుడు (గడ్డిజాతి 3 వరుసలు + 1 వరుస దశరథ గడ్డి) విత్తన మోతాదు: ఎకరాకు 2 కిలోలు

**విత్తే దూరం:** 50×50 సెం.మీ.

**విత్తనశుద్ధి:** విత్తనాలను నాలుగు నిమిషాలు $80^0$ సెం.గ్రే. వద్ద వేడినీటిలో ఉంచి తీసి చల్లని నీటిలో ఒక రాత్రంతా నానబెట్టాలి.

**విత్తే పద్ధతి:** బోదెలపై 1 సెం.మీ. లోతుగా వేయాలి. లోతు ఎక్కువైతే మొలకలు రావడం తగ్గిపోతుంది.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 30 రోజుల తర్వాత చేతితో కలుపు తీసి మట్టిని ఎగదోయాలి, తవ్వాలి. ఆ తర్వాత కలుపు తీవ్రతను బట్టి మరొకసారి తీయాలి.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మరల మూడవరోజు పలుచటి నీటి తడి ఇవ్వాలి. ఆ తర్వాత నేల స్వభావాన్ని బట్టి 10-15 రోజుల వ్యవధిలో నీటి తడి ఇవ్వాలి.

వర్షాధారంగా కంటే నీటిపారుదల కింద సాగు చేసినట్లైతే అధిక పశుగ్రాస దిగుబడి వస్తుంది. ఎలాంటి విషపదార్థాలు ఉండవు. కొంతవరకు బెట్టను తట్టుకుంటుంది. దీనిని పొలం చుట్టూ గట్ల పైన సాగు చేయవచ్చును. దీనిని ధాన్యపు పంటలతో, మిగిలిన పశుగ్రాస పంటలతో మిశ్రమ పంటగా సాగుచేయవచ్చును. ఈ పంట 1.5 మీటర్ల ఎత్తు వరకు పెరిగి మేకలను, గొర్రెలను మేపడానికి అనుకూలంగా ఉంటుంది.

**సాగు వివరాలు:**

**విత్తు సమయం:** నీటి వసతి ఉన్నట్లైతే అన్ని కాలాల్లో సాగు చేయవచ్చును. వేసవిలో జనవరి-ఫిబ్రవరి

**అనువైన నేలలు:** అన్ని రకాల నేలలు అనుకూలం.

**ఎరువుల యాజమాన్యం:**

| | | |
|---|---|---|
| పశువుల ఎరువు | - | 5 టన్నులు / ఎకరాకు |
| నత్రజని | - | 8 కిలోలు / ఎకరాకు (18 కిలోలు యూరియా) |
| భాస్వరం | - | 24 కిలోలు / ఎకరా (150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) |
| పొటాషియం | - | 12 కిలోలు / ఎకరా (20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) |

ఎరువులన్నింటినీ ఆఖరి దుక్కిలో వేసి చదును చేయాలి.

**కోత సమయం:** విత్తిన 90-100 రోజులకు మొదటి కోత కోయాలి. ఈ దశలో మొక్కలు సుమారుగా 50 సెం.మీ. ఎత్తుగా ఉన్నప్పుడు కోయాలి. తర్వాత కోతలు 30-45 రోజులకు కోసుకోవాలి. ఒక ఏడాదిలో సుమారుగా 4-5 కోతలు తీసుకోవచ్చును. మిశ్రమ పంటగా వేసినప్పుడు 60-80 రోజలకు, తదుపరి కోతలు 45 రోజులకు ఒకసారి చొప్పున కోయాలి. ప్రతీసారి కోసిన తర్వాత ఎకరాకు 10 కిలోల నత్రజనిని అందించాలి.

**పచ్చిమేత దిగుబడి:** ఒక ఎకరానికి ఏడాదికి 4-5 కోతలలో 50-56 టన్నుల పచ్చిమేత దిగుబడి లభిస్తుంది. ఒక కోత పచ్చిమేత దిగుబడి సుమారుగా 11.2-12.5 టన్నులు. విత్తనం కోసమైతే మొదటి కోతను 130-135 రోజులకు కోయవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **9959306929**



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సంవత్సరం యాసంగి మరియు ఎండాకాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 23 సం॥ ల నెలవారీ మోడల్ ధరలు మరియు 8 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 రబీ మరియు ఎండాకాలం పంట కోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

**2025-26 యాసంగి పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట్ | మార్చి - మే | 2200-2400 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | మార్చి - మే | 2400-2800 |

**2025-26 ఎండాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | టమాటా | బోయినపల్లి | మార్చి - ఏప్రిల్ | 800-1000 |
| 2. | వంకాయ | బోయినపల్లి | మార్చి - ఏప్రిల్ | 1540-1900 |
| 3. | బెండ | బోయినపల్లి | మార్చి - ఏప్రిల్ | 1650-1850 |
| 4. | బత్తాయి | గడ్డిఅన్నారం | మార్చి - ఏప్రిల్ | 3100-3400 |
| 5. | మామిడి | గడ్డిఅన్నారం | మార్చి - మే | 4100-4880 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక:** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 23 సం॥ ల నెలవారీ మోడల్ ధరలు మరియు 7 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.






# ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మెగా స్నాతకోత్సవం



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 56,57,58వ స్నాతకోత్సవం సంయుక్తంగా 09.02.2026న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.




ముందుగా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య స్నాతకోత్సవ నివేదికని సమర్పించారు. బోధన, పరిశోధన, విస్తరణ అంశాలలో విశ్వవిద్యాలయం అనేక చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుందని తెలిపారు. తొలిసారిగా వ్యవసాయ కూలీల పిల్లలకి యూజీ కోర్సుల్లో 15 శాతం సీట్లు ప్రత్యేకంగా కేటాయించామని, అలాగే ప్రత్యేక కోటా సీట్ల ఫీజుని 10 లక్షల రూపాయల నుంచి 5 లక్షలకి తగ్గించినట్లు తెలిపారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా 1200 గ్రామాల్లోకి వెళ్లి లక్షా 20 వేలమంది రైతులని నేరుగా కలిసామని తెలిపారు. నూతనంగా కొడంగల్, నిజామాబాద్, హుజూర్‌నగర్ లలో వ్యవసాయ కళాశాలలని ప్రారంభించామని, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ సహా అనేక అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేస్తున్నామన్నారు. ఈ అన్ని చర్యల వల్ల విశ్వవిద్యాలయం ర్యాంక్ 37 నుంచి 24 కు పెరిగిందని ప్రకటించారు. ఐకార్, రాష్ట్ర ప్రభుత్వాల నిరంతర సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థానానికి తీసుకుని వెళ్ళడానికి కృషి చేస్తామని ప్రొ॥ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు.




ఈ స్నాతకోత్సవానికి అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు టాటా - కార్నెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ న్యూట్రిషన్ డైరెక్టర్ డా॥ ఎల్. ప్రభు పింగళికి గారు ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ అత్యంత ప్రతిభాశాలి జానయ్య నేత్రత్వంలో విశ్వవిద్యాలయం మంచి ప్రగతి సాధిస్తోందని, 1960 లలో ఆహార కొరత ఎదుర్కొన్న భారత దేశం హరిత విప్లవం వల్ల నేడు ఆహార ఉత్పత్తులని ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని కాకపోతే











పప్పుధాన్యాలు, తృణధాన్యాల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామని, దాని కారణంగా అధిక సంఖ్యాక ప్రజలలో పోష్టికాహార లోపం ఉందని, అదే విధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజల ఆహార అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయని, పాశ్చాత్యుల ఆహారపు అలవాట్లు మన వారికీ అలవడుతున్నాయని ఆయన వివరించారు. అదే విధంగా కోవిడ్ తర్వాత డిజిటలీకరణ కారణంగా వివిధ యాప్‌ల ద్వారా ఇంటి వద్దకే ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సాగు పద్ధతులు, పంటల సరళి, విధానాలు మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధునాతన టెక్నాలజీలు, డిజిటల్ విధానాలని, విస్తరణ సేవలని సన్న, చిన్నకారు రైతాంగానికి అందుబాటులోకి తీసుకొని రావాలని, పంటల వైవిధ్యీకరణ తోడ్పడే విధంగా వ్యవసాయ విధానాలు రూపొందించాలని సూచించారు. రవాణా, మార్కెటింగ్ వ్యవస్థ, నిల్వ సదుపాయాలలో ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడులు అధికం కావాలన్నారు. వినియోగదారుల ఆహారపు అలవాట్లకి అనుగుణంగానూ, ప్రజలకి పోష్టికాహార భద్రత అందించే విధంగానూ ప్రణాళికలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ మెగా స్నాతకోత్సవంలో 2135 మంది అండర్ గ్రాడ్యుయేట్స్‌కి, 480 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కి, 129 మందికి పీహెచ్‌డీ పట్టాలు అందచేశారు.

### బంగారు పతకాలు ప్రధానం

అదేవిధంగా 56,57,58వ సంయుక్త స్నాతకోత్సవం లో 64 మంది అండర్ గ్రాడ్యుయేట్స్‌కి, 26 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కి, ఆరుగురు పీహెచ్‌డీ లకు బంగారు పతకాలు అందచేశారు. 56వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని గన్నేరపు నవ్య ఆరు బంగారు పతకాలు సాధించింది. అలాగే 58వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని స్నేహలత ఏడు బంగారు పతకాలని సాధించింది. బీఎస్సీ(అగ్రికల్చర్) విద్యార్థిని మారం సంజన 5 బంగారు పతకాలు సాధించింది.



# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రియూత్ ఫెస్ట్





వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో అగ్రియూత్ ఫెస్ట్ 2025-26 (యువజనోత్సవాలు) ఫిబ్రవరి 19-21 వరకు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ యువజనోత్సవాల్లో రాష్ట్ర పరిధిలోని 13 వ్యవసాయ కళాశాలలు, అనుబంధ కళాశాలల నుంచి 280 మంది విద్యార్థులు పాల్గొని, మొత్తం 13 విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డా॥ రమణా రావు, విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా॥ సిహెచ్. వేణుగోపాల రెడ్డి, పీజీ స్టడీస్ డీన్ డా॥ కె.బి. ఈశ్వరి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా॥ ఎమ్. గోవర్ధన్ మరియు సిరిసిల్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా॥ కె.బి. సునీత దేవి ముఖ్య అతిథిలుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, ఆవిశ్కరణాత్మక ఆలోచనలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రీన్ ఎక్స్ ఫో ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణ, అధిక సాంకేతికతలు, సుస్థిర వ్యవసాయ విధానాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలను అతిథులు పరిశీలించి అభినందించడం జరిగింది.

అగ్రియూత్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం అని భావించేవాడినని, వారి ప్రతిభా పాఠవాలు చూసాక సరైన మార్గదర్శనం, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టించగలుగుతారని అనిపించిందన్నారు. ఆట - పాట వంటి కార్యక్రమాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారన్నారు. అగ్రి బజ్ పోటీలలో జగిత్యాల, వరంగల్, సంగారెడ్డి కళాశాలలు విశిష్ట ప్రతిభ కనబరిచాయని, విద్యార్థులు తమ జ్ఞానం, సమయపాలన, చురుకుదనంతో విజేతలుగా నిలిచారని, యూత్ పార్లమెంట్ పోటీలలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రధమ స్థానంలో నిలిచారని, టి.





భరత్, దోరా వారి బృందం అద్భుతంగా ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. యూత్ పార్లమెంట్‌లో ద్వితీయ స్థానంలో వరంగల్ వ్యవసాయ కళాశాల, తృతీయ స్థానం అశ్వారావుపేట్ వ్యవసాయ కళాశాలలకు లభించడం సంతోషకరమని, ఈ యూత్ ఫెస్ట్‌లో బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డును భరత్ అందుకొని, మంత్రిగా మరియు ప్రశంసలు పొందారని, సాహిత్య పోటీలు, ఇంగ్లీషు ఎలక్యూషన్‌లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల మొదటి స్థానం, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ రెండవ స్థానం, సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల మూడవ స్థానంలో నిలిచాయన్నారు. యూత్ ఫెస్టివల్ నిర్వాహణ కమిటీలో ఉన్న ప్రొఫెసర్లు, ప్రజా సంబంధాల అధికారులు, విద్యార్థులు యువజనోత్సవాలు విజయవంతంగా జరగడానికి ఎంతో కష్టపడ్డారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, పాలకమండలి సభ్యులు, వివిధ కళాశాలల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.
















# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునిత దేవి




**అడ్డం:**

1. పిజెటిఎయు ఆధ్వర్యంలోని ఏరువాక కేంద్రాలకు ...............గా పేరు మార్చబడింది ? (7)
3. విత్తనోత్పత్తి చేసే / జరిగే పొలంలో ఇవి అసలు ఉండకూడదు? (3)
4. వరిలో పత్రహరితాన్ని గోకి తినడం వలన తెల్లటి మచ్చలు, నిలువు చారలు ఏ పురుగు వలన ఆశిస్తాయి? (6) కుడి నుండి ఎడమకు
5. నూనెగింజలకు సంబంధించిన ఓ పంట పూరేకులను డికాక్షన్‌గా వాడుతారు? ఏ పంట? (3) (కుడి నుండి ఎడమకు)
6. పొగాకు లద్దెపురుగు మరియు కత్తెర పురుగుల ఎదిగిన లార్వాలను నివారించుటకు ఏమి తయారు చేసి సాయంత్రం వేళల్లో వెదజల్లాలి? (5)
9. బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ వ్యాప్తి ఏ పురుగు ద్వారా జరుగుతుంది? (4) (కుడి నుండి ఎడమకు)
10. పసుపులో ఉండే రసాయన సమ్మేళనం ఏది? (4)
11. ఏ మిత్ర పురుగు యొక్క తల్లి పురుగులు పూల పుప్పొడిని, పిల్ల పురుగులు, రసం పీల్చు పురుగులను, కాయ తొలుచు పురుగులను మరియు గ్రుడ్లను తిని మేలు చేస్తాయి? (7) (కుడి నుండి ఎడమకు)
12. వరి పంటలో ఆకుల తొడిమెల పైన, కాండం మీద, రెండు లేదా మూడు సెం.మీ. పొడవు కలిగిన దీర్ఘ వృత్తాకారంలో మచ్చలు ఏర్పడి, ఒకదానితో ఒకటి కలిసిపోయి పాము పొడ ఆకారం పోలి ఉంటాయి. ఏ తెగులు? (7)

**నిలువు:**

2. ఈ మధ్యకాలంలో మిరపను ఎక్కువగా ఆశించి నష్టపరుస్తున్న పురుగు ఏది? (8)
7. వరిలో ఆశించే ఓ తెగులు... ఐసోప్రోతయోలేన్ మందు వాడమని సిఫారసు చేస్తున్నారు ఏ తెగులు? (5) (క్రింది నుండి పైకి)
8. పట్టు పురుగులను పెంచడం, తద్వారా ముడి పట్టును ఉత్పత్తి చేసే ప్రక్రియను ఏమంటారు? (5)
13. ఈ మధ్య మొక్కజొన్నలో సమస్యాత్మకంగా మారిన కత్తెరపురుగు, ప్రత్తిలో గులాబీరంగు పురుగును ఏమి ఉపయోగించి నిఘా పెట్టాలి? (8) (క్రింది నుండి పైకి)

సమాధానాలు 50వ పేజీలో

# పామాయిల్ సాగు, పామాయిల్ నూనె వాడకం వలన కలిగే లాభాలు మరియు అపోహలు మీకు తెలుసా !

డా॥ ఎ. పోశాద్రి
**ఫుడ్ టెక్నాలజీ విభాగం, పిజెటిఎయు, రాజేంద్రనగర్**





మన గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు రేడియో ప్రోగ్రాం మన్‌కి బాత్‌లో మాట్లాడుతూ దేశ ప్రజలు వంటనూనె వాడకాన్ని కనీసం 10 శాతం వరకు తగ్గించవలసిన అవసరం ఉంది అని తెలిపారు. దేశంలో రోజురోజుకీ నూనె వాడకం పెరుగుతూ ఉండడం మరియు తగ్గించకపోతే భవిష్యత్తులో 2050 నాటికి దేశంలో సుమారు 44 కోట్ల మంది స్థూలకాయంతో బాధపడే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వంట నూనెల వినియోగంలో స్వీయ నిబంధనలు పాటించక అధిక మోతాదులో వాడినట్లయితే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కావున జాతీయ పోషకాహార సంస్థ, సాధారణ మానవునికి రోజుకు 2000 కిలో క్యాలరీల శక్తి అవసరం అని సూచిస్తున్నది. మనం తీసుకునే ఆహార పళ్లెంలో సుమారు 15% కంటే ఎక్కువ మోతాదులో శక్తి నూనె పదార్థాల వలన వస్తే, సుమారు 30 గ్రా. నూనె లేదా కొవ్వు రోజు ఆహారంగా తీసుకున్నట్లయితే దానిని ఎక్కువ నూనె పదార్థముగా పరిగణిస్తారు. ప్రతిరోజు నూనెలు లేదా కొవ్వు పదార్థాలు వండటానికి వాడే ఏదైనా నూనె పదార్థాలు 27 గ్రా. కంటే ఎక్కువగా ఒక మనిషి తీసుకోరాదు. మన దేశం యొక్క వార్షిక వినియోగము సుమారు 28.9 మిలియన్ మెట్రిక్ టన్నులు. దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలు మన దేశీయ వినియోగంలో సుమారు 57 శాతం. కేవలం వంట నూనెల కోసం సుమారు 1.20 లక్షల కోట్ల రూపాయలను వెచ్చిస్తూ ఉన్నాము. దిగుమతి చేసుకుంటున్న వంట నూనెలలో పామాయిల్ వాటా 59%, సోయాబీన్ నూనె 23% మరియు 17% పొద్దుతిరుగుడు నూనె. గడిచిన 10 సంవత్సరాలలో వంట నూనెల దిగుమతి వృద్ధిరేటు 57%. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న వనరులు, పెరుగుతున్న వంటనూనెల వినియోగం భవిష్యత్తులో ఎంతో ఆందోళన కలిగిస్తుంది.

మరోవైపు ఒక టన్ను పామాయిల్ వంట నూనె ఉత్పత్తి చేయడానికి సుమారు 0.26 హెక్టార్ల భూమి, ఒక టన్ను నువ్వుల నూనె ఉత్పత్తికి సుమారు 1.6 హెక్టార్ల భూమి, ఒక టన్ను ఆవాల నూనె ఉత్పత్తికి సుమారు 1.49 హెక్టార్ల భూమి, ఒక టన్ను ప్రొద్దుతిరుగుడు నూనె ఉత్పత్తికి సుమారు 2.04 హెక్టార్ల భూమి మరియు ఒక టన్ను సోయాబీన్ నూనె ఉత్పత్తికి సుమారు 2.63 హెక్టార్ల భూమి అవసరమవుతుంది. తక్కువ భూమిలో ఎక్కువ వంట నూనె ఉత్పత్తి పామాయిల్ సాగు ద్వారానే సాధ్యం కనుక

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ సాగును, పామాయిల్ నూనె శుద్ధి పరిశ్రమలను ఏర్పాటుకు జాతీయ పామాయిల్ మిషన్ ద్వారా ప్రోత్సహిస్తున్నది. ఇతర నూనె గింజల విస్తీర్ణం పెంచడం ద్వారా దిగుమతి అంతరాలను తగ్గించడం అంత సులభమైనది కాదు. ఇప్పుడున్న నూనెగింజల సాగు విస్తరణం రెండింతలు అయితే గాని సాధ్యపడదు. తగ్గుతున్న వ్యవసాయ భూమి వల్ల ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహిస్తూ, వంటనూనెల వినియోగాన్ని 10 శాతానికి తగ్గిస్తూ భారతదేశాన్ని ఆత్మనిర్భర్ వంట నూనెల దేశముగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

**పామాయిల్ సాగు, పామాయిల్ నూనె వాడకం వలన కలిగే లాభాలు మరియు అపోహాలు మీకు తెలుసా !**

- ప్రపంచ వంటనూనెల వాణిజ్యం మరియు వాడకంలో పామాయిల్ స్థానం మొదటిది.
- ప్రపంచంలో పామ్ ఆయిల్ వినియోగంలో భారతదేశం రెండో స్థానంలో ఉంది. ప్రపంచంలో వంట నూనెల వినియోగంలో పామాయిల్ మూడవ స్థానం.
- మన దేశంలో ఏటా 9-10 మిలియన్ మెట్రిక్ టన్నుల పామాయిల్ వినియోగిస్తున్నాము.
- 2023వ సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 50.69 మిలియన్ మెట్రిక్ టన్నుల పామాయిల్ ఎగుమతులు జరిగాయి. సుమారు 81.42 మిలియన్ మెట్రిక్ టన్నుల పామాయిల్ ప్రపంచ వ్యాప్తంగా వినియోగించారు.
- సుమారు 68.75 మిలియన్ మెట్రిక్ టన్నుల పామాయిల్ ఇండోనేషియా మరియు మలేషియా దేశాలు ఉత్పత్తి చేయడం జరిగినది.
- ఒక టన్ను పామాయిల్ వంట నూనె ఉత్పత్తి చేయడానికి సుమారు 0.26 హెక్టార్ల భూమి అవసరం. ఒక హెక్టారు నుండి 4 టన్నుల పామాయిల్ నూనె ఉత్పత్తి చేయవచ్చు.
- సుమారు 3.6 మిలియన్ హెక్టార్లలో పామాయిల్ సాగు చేయడం ద్వారా సుమారు 14.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పామాయిల్ నూనె ఉత్పత్తి దేశీయంగా చేయవచ్చు.
- వంట నూనెలో ఆత్మనిర్భర్ భారత్ కావడానికి పామాయిల్ సాగు అత్యంత ఆవశ్యకం.
- 2027 సంవత్సరం వరకు పామాయిల్ సాగు దేశంలో ఒక మిలియన్ హెక్టార్లకు విస్తరించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.
- 2030 సంవత్సరం నాటికి సుమారు 3 మిలియన్ మెట్రిక్ టన్నుల దేశీయ క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది.
- తెలంగాణలో 2024-25 వరకు 2.43 లక్షల ఎకరాలలో రైతులు ఆయిల్ పాము సాగు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44 పామాయిల్ నర్సరీ ద్వారా రైతులకు నాణ్యమైన పామాయిల్ మొక్కలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది.
- మన రాష్ట్రంలో సుమారు 14 పామాయిల్ పరిశ్రమలను క్రూడ్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు.
- పామాయిల్ పేదవాళ్ల ఆయిల్, దీనికి ధర తక్కువ అని ప్రచారం ఉంది. ధర తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం హెక్టార్ భూమిలో మిగతా నూనెల కన్నా దిగుబడి ఎక్కువగా ఉన్నందున పామాయిల్ ధర తక్కువగా ఉంది. అంతేకానీ ఇది పేదవాళ్ల నూనె కాదు.
- ప్రపంచ వ్యాప్తంగా అన్నిరకాల నూనె గింజల వంటల నూనె ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే సాగు భూమిలో కేవలం 6 శాతం భూమిలోనే పామాయిల్‌ని ఉత్పత్తి చేయవచ్చు. మరియు ఇది ప్రపంచంలోని 40% వంట నూనెల సరఫరాను తీర్చుతుంది. అదే మొత్తంలో నూనె గింజల వంట నూనె పొందడానికి 4 నుండి 10 రెట్ల ఎక్కువ సాగుభూమి అవసర పడుతుంది.
- ప్రపంచ వ్యాప్తంగా పామాయిల్ వంటనూనెగా, ఆహార పరిశ్రమలలో ఫ్రైయింగ్ ఆయిల్‌గా, బేకరీ ఉత్పత్తులలో ముఖ్యంగా బిస్కెట్లు, కేక్స్, బ్రెడ్ ఇతర ఫాస్ట్ ఫుడ్ ఇండస్ట్రీ ఉత్పత్తుల్లో, చాక్లెట్ పరిశ్రమలో, ఐస్ క్రీమ్ ఉత్పత్తులలో, కన్ఫెక్షనరీ పరిశ్రమలలో, నాన్ డైరీ పరిశ్రమలలో ముఖ్యంగా పాలు మరియు పాల ఉత్పత్తులు కొవ్వుకు బదులుగా వివిధ రకాల ప్లాంట్ బేస్డ్ ఆహార ఉత్పత్తుల్లో ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్నారు.
- పామాయిల్‌కు ఆక్సిడేటివ్ స్టెబిలిటీ కారణంగా పామాయిల్‌తో చేసిన ఆహార ఉత్పత్తులు ఎక్కువ రోజులు నిల్వగా ఉంటాయి.
- వివిధ ఆహార పదార్థాలను ఫ్రై చేసే సమయాలలో ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే పొగ ఏర్పడుతుంది.
- డీప్ ఫ్రై చేసినప్పుడు ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద కూడా కొవ్వు ఆమ్లాల మిశ్రమంలో మార్పులు చెందవు. తద్వారా హానికర పదార్థాలు ఉత్పత్తి తక్కువగా ఉంటుంది.

- పామాయిల్‌ను వనస్పతికి బదులుగా వాడవచ్చు. తద్వారా నూనెలను హైడ్రోజనేషన్ చేయవలసిన అవసరం ఉండదు. దీనివలన హానికరమైన ట్రాన్స్ ఫాట్స్ ఏర్పడవు.
- పామాయిల్ ఇతర నూనెలతో వివిధ నిష్పత్తిలలో కలిపినప్పుడు మనకు కావలసిన కుకింగ్ క్వాలిటీస్ పొందవచ్చు.
- పామాయిల్ సంతృప్త కొవ్వు ఆమ్లాలను కలిగి ఉన్నప్పటికీ దానిలోని పామ్ ఓలిన్ మోనో అన్‌సాచ్యురేటెడ్ నూనె లాగా కొలెస్ట్రాలపై ప్రభావం చూపుతుంది.
- పామాయిల్ సహజమైన టోకోట్రినాల్స్ (78 – 82%) కలిగి ఉండడం వలన టోకోఫెరోల్స్ కంటే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్.
- వివిధ పరిశోధనలో పామాయిల్ వాడడం వలన అంటీ ఇన్‌ఫ్లమేటరీ, కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, క్యాన్సర్ నివారణ, రేడియో ప్రొటెక్టివ్, న్యూరో ప్రొటెక్టివ్ ప్రాపర్టీస్‌ని కలిగి ఉంటాయని చెప్పడం జరిగినది.
- రెడ్ పామాయిల్‌లో కెరోటినాయిడ్స్ పుష్కలంగా దొరుకుతాయి. క్రియాశీలమైన ప్రో విటమిన్ – ఏ ఆల్ఫా మరియు బీటా కెరోటిన్ రూపంలో విరివిగా దొరుకుతాయి. కంటి శుక్లం నివారణ పామాయిల్ చక్కటి ఉపాయం.
- పామాయిల్ ఆరోగ్యానికి అవసరమైన సంతృప్త మరియు అసంతృప్త కొవ్వు ఆమ్లాల సమతుల్య కూర్పును కలిగి ఉంటుంది. 50% సంతృప్త రకం, కొవ్వు ఆమ్లాలు, 40% మోనో అన్‌సాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు మరియు 10% పాలీ అన్‌సాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు.
- పామాయిల్ ఒక ఆరోగ్యకరమైన మరియు పోషకమైన వంటనూనె, వినియోగానికి సురక్షితమైనది మరియు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభాకు ఆహార భద్రతకు పామాయిల్ సాగు తప్పనిసరి.
- పామాయిల్ సౌందర్య సాధనాలకు మరియు వ్యక్తిగత సంరక్షణ పరిశ్రమలో ముఖ్యమైన ముడి సరుకు, టూత్ పేస్టు, సబ్బులు, షాంపూలు, లోషన్లు మరియు అలంకరణ ఉత్పత్తులలో కూడా విరివిగా వినియోగిస్తారు. పామాయిల్ లేకుండా చర్మ సంరక్షణ దాదాపు అసాధ్యం.
- పామాయిల్, జీవనోపాధి మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని నిరూపించబడింది. పేదరిక నిర్మూలనలో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో పామాయిల్ రంగం అత్యధికంగా దోహదపడుతుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9492828965**

**ఫిబ్రవరి 2026 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క్ర.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 02.02.2026 | Global Agricultural Extension Landscape-Challenges and Sustainable Solutions |
| 2. | 11.02.2026 | 56th 57th & 58th Combined Convocation Photos - 2026 |
| 3. | 12.02.2026 | 56th, 57th, 58th Combined Convocation Address by Prof. Prabhu L. Pingali |
| 4 | 23.02.2026 | 56th 57th 58th COMBIND CONOVOCTION - GLIMPSES - II PJTAU |

**ఫిబ్రవరి 2026 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1 | 05.02.2026 | యాసంగిలో కాండం తొలుచు పురుగు – నివారణ |
| 2 | 28.02.2026 | పశువులలో వచ్చే పొదుగువాపు వ్యాధి – నివారణ |

# జీవన ఎరువులు పంటకు సిరులు...

యస్. హరీష్, డా॥ జి. వినయ్, డా॥ ఏ. రామకృష్ణ, డా॥ ఈ. అజయ్ కుమార్, డా॥ బి. శ్రీనివాస్ మరియు డా॥ యస్. వినోద్ కుమార్

వ్యవసాయ సూక్ష్మ జీవశాస్త్రం మరియు జీవ ఉత్పత్తి విభాగం, వ్యవసాయ కళాశాల, పిజెటిఏయు, రాజేంద్రనగర్




మొక్కకు పోషకాలను అందించే సూక్ష్మజీవుల సముదాయమే జీవన ఎరువులు. హరిత విప్లవం తరువాత అందుబాటులోనికి వచ్చిన సంకర వంగడాల సాగులో అధిక దిగుబడులే ధ్యేయంగా సాగిన మన వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది దీని వల్ల భూములు నిస్సారమవటం, వాతావరణ కాలుష్యం పంట ఉత్పత్తిలోని అవశేషాల వల్ల తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలు ఇలా అన్ని అనర్ధాలే రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూమిలోని పోషకాలను మొక్కలకు అందేలా దోహదపడేవి జీవన ఎరువులు. జీవన ఎరువుల వాడకంతో రైతులకు ఖర్చు తగ్గడమే కాదు భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి నాణ్యమైన దిగుబడులను పొందవచ్చు. వీటిలో నత్రజని, భాస్వరం, జింక్, పొటాషియంను స్థిరీకరించే జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జీవన ఎరువులు అంటే నేల మరియు వాతావరణంలో ఉన్న పోషకాలను గ్రహించి మొక్కకు అందించే సూక్ష్మ జీవుల సమూదాయన్నే జీవన ఎరువులు అంటాం.

**నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు:**

1) రైజోబియం

2) అజటోబాక్టర్

3) అజోస్పైరిల్లం

4) అజోల్లా

5) ఫాస్ఫోబ్యాక్టీరియా – భాస్వరాన్ని అందించే జీవన ఎరువు

6) పొటాషియం అందించే జీవన ఎరువు

7) జింకును అందించే జీవన ఎరువు

**నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు:**

1) **రైజోబియం:** రైజోబియం జీవన ఎరువులు పప్పుజాతి పంటలైన పెసర, అలసంద, సోయా మినుము కంది పంటలకు రైజోబియం జీవన ఎరువులు వాడుతుంటాం. రైజోబియం అను బ్యాక్టీరియా మొక్కలతో కలిసి నత్రజనిని స్థిరీకరిస్తుంది. ఈ రకమైన సూక్ష్మజీవులను పప్పుజాతి పంట మొక్కల వేర్లతో సహజీవనం చేస్తూ గాలిలో ఉన్న 78% నత్రజనిని మొక్కల వేర్లను ఆకర్షించి వేర్లమీద గులాబీ రంగు కలిగిన వేరు బుడిపలను ఏర్పాటు చేస్తాయి

2) **అజటోబాక్టర్:** ఈ సూక్ష్మజీవులు నేలలో ఒంటరిగా ఉంటూ మొక్కలకు నత్రజనినీ స్థిరీకరిస్తాయి మరియు మొక్క పెరుగుదలకు దోహదపడే ఇతర హార్మోన్లను విటమిన్లను అందించి వేరు పెరుగుదలకు తోడ్పడతాయి అంతేకాకుండా మొక్కలకు వ్యాధి నిరోధక శక్తిని మరియు బెట్టను తట్టుకునే శక్తిని పెంచుతాయి. ఈ బ్యాక్టీరియా ముఖ్యంగా కార్బన్ ఎక్కువగా ఉన్న భూములలో సమర్థవంతంగా పనిచేస్తుంది. ఈ జీవన ఎరువులు అన్ని వాణిజ్య పంటలైన మిరప, ప్రత్తి , చెఱకు, ప్రొద్దుతిరుగుడు కుసుమలు, ఆకుకూరలు కూరగాయలు పూలు మరియు పండ్లతో సిఫారసు చేయబడిన మోతాదులో వాడి మంచి ఫలితాలు పొందవచ్చు.

3) **అజోస్పైరిల్లం:** ఈ బ్యాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశమున్నచోట వేర్లలోకి చొరబడి వాటి సంఖ్యను అభివృద్ధి చేసుకుంటుంది. దీని కారణంగా ఈ జీవన ఎరువులు స్థిరీకరించిన నత్రజనిని నేరుగా మొక్కకు ఎక్కువ శాతం అందుబాటులో ఉంచును. ఈ మధ్యకాలంలో ఈ అజోస్పైరిల్లం ప్రాముఖ్యత సంతరించుకుంది, ఎందుకంటే ఈ బ్యాక్టీరియా సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్న నేలలో కూడా సమర్థవంతంగా పనిచేసే మొక్క పెరుగుదలకు దోహదం చేస్తుంది. అజోస్పైరిల్లం జీవన ఎరువులు వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, రాగి, సజ్జ, ప్రొద్దుతిరుగుడు కూరగాయలు మరియు అరటి మొదలైన పంటలకు బాగా ఉపయోగపడుతుంది.

**4) అజోల్లా:** అజోల్ల అనేది ఒక చిన్న జలచర ఫెర్న్. దీనిని వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు. ఇది ముఖ్యంగా పశువులకు దాణాగా, సేంద్రియ ఎరువుగా మరియు వరి పొలాలలో నత్రజని అందించడానికి ఉపయోగిస్తారు. అలాగే కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించడానికి మరియు దోమల నియంత్రణకు కూడా ఇది ఉపయోగపడుతుంది. అజోల్లాలో నత్రజని ఉంటుంది, కాబట్టి ఇది నేల సారవంతం చేయడానికి ఉపయోగపడుతుంది. ఇది రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది మరియు వరి పొలాలలో నత్రజనిని అందించడానికి బాగా ఉపయోగ పడుతుంది.

**5) ఫాస్ఫోబ్యాక్టీరియా (భాస్వరం అందించే జీవన ఎరువు):** పంట పొలాల్లో వాడిన భాస్వరం భూమిలో వేసిన కొద్ది రోజుల వ్యవధిలో భూమి యొక్క ఉదజని సూచికను బట్టి వివిధ రకాలైన లభ్యం కాని భాస్వరం ఇనుము లేదా అల్యూమినియం ఫాస్ఫేట్లుగా మరియు క్షార గుణం ఉన్నచో కాల్షియం లేదా మెగ్నీషియం ఫాస్ఫేట్లుగా మారి మొక్కకు లభ్యం కాకుండా భూమిలో గడ్డలుగా పేరుకుపోతుంది ఈ పరిస్థితులలో భాస్వరం కరిగించే జీవన ఎరువులు బాసిల్లస్ గాని సుడోమోనాస్ గానీ పంటలలో వేసినచో స్థిరీకరించిన భాస్వరంను మొక్కకు లభ్యస్థితిలోకి మార్చి మొక్కలకు ఉపయోగంలోకి తీసుకొని రాబడుతుంది.

**6) పొటాషియంను మొక్కలకు అందించేవి:** ఈ రకమైన జీవన ఎరువులు వాడటం వలన నేలలోని పొటాషియం యొక్క లభ్యత పెరిగి మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది. బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే వివిధ రకాల ఎంజైములు మరియు ఆమ్లాల వలన కరగని స్థితిలో ఉన్న పొటాషియం కరిగి మొక్కకు అందజేస్తుంది. ఈ జీవన ఎరువులు అన్ని రకాల పంటలకు వేసుకోవచ్చు.

**7) జింక్‌ను కరిగించే సూక్ష్మజీవులు:** ప్రస్తుత వ్యవసాయంలో జింకు పోషకం చాలా వరకు పెరిగింది. మనం తీసుకునే ఆహారంలో జింక్ దొరకడం లేదు ఎక్కువగా జింక్ లోపం పంట పొలాలలో గమనించవచ్చు. దీని యొక్క లభ్యత పంట పొలాల్లో పెంచుటకు జింకును కరిగించే సూక్ష్మజీవిని వాడినట్లయితే నేలలో ఉండే జింక్‌ను కరిగించి మొక్కలకు అందిస్తుంది ఈ బ్యాక్టీరియాను అన్ని రకాల పంటల్లో వాడుకొని జింకు లభ్యతను పెంచుకోవచ్చు.

## జీవన ఎరువులను ఉపయోగించే పద్ధతులు:

**1) విత్తనశుద్ధి:** ఒక కిలో విత్తనమునకు 15 నుండి 20 గ్రాముల జీవనఎరువును సమానమోతాదులో 10% చక్కెర లేదా బెల్లం ద్రావణానికి కలిపి విత్తనం చుట్టూ సమానంగా పట్టునట్లు కలపవలెను. తరువాత 30 నిమిషాలు నీడలో ఆరబెట్టి విత్తనం విత్తుకోవలెను. జీవన ఎరువులు, విత్తుకునే ముందు మాత్రమే పట్టించాలి.

**2) నారును ముంచి నాటే పద్ధతి:** ఈ పద్ధతి ముఖ్యంగా అజోస్పైరిల్లం అనే జీవన ఎరువు వాడటానికి ఉపయోగపడను. సుమారు ఒక కిలో జీవన ఎరువును 70% నీటిలో కలిపి నారుమడులలో చిన్నకుంట చేసి దానిలో పోయవలెను. ఈ నీటిలో పీకిన నారు యొక్క వేర్లను 10 నిమిషాలు ముంచి తదుపరి నాట్లు వేసుకోవలెను.

**3) భూమిలో వేసే పద్ధతి:** రెండు కిలోల జీవన ఎరువులు దాదాపు 200 కిలోల పశువుల ఎరువులతో గాని వానపాముల ఎరువులతో గాని లేదా ఇతర సేంద్రియ ఎరువుతో గాని కలిపి విత్తనమును నాటిన సాళ్ళలో పడేటట్లు వేసుకోవలెను. ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలంలో చేపట్టే మొదటి అంతరకృషి చేయుటకు ముందుగా జీవన ఎరువులు వాడటం ముగించవలెను.

## జీవన ఎరువుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

1) జీవన ఎరువు ప్యాకెట్ మరియు బాటిల్స్‌ను ఎండ తగలని నీడ ప్రదేశాలలో నిలువ చేయవలెను.

2) జీవన ఎరువులు గడువు తేదీ లోపల మాత్రమే ఉపయోగించాలి.

3) రసాయనిక ఎరువులు లేదా పురుగు మందులతో కలిపిన జీవన ఎరువులను వాడకూడదు.

4) సేంద్రియ ఎరువులతో కలిపిన జీవనఎరువును వాడుకుంటే బాగా పనిచేస్తాయి.

## జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేసే వివిధ రకాల జీవన ఎరువులు

1) రైజోబియం

2) అజటోబాక్టర్

3) అజోస్పైరిల్లం

4) భాస్వరం కరిగించే జీవన ఎరువులు

5) పొటాషియంను కరిగించే జీవన ఎరువులు

6) జింక్‌ను కరిగించే జీవన ఎరువులు

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8500598177



# మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు


డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**


**మామిడి:** కాయతొలుచు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా బీటాసైఫ్లుత్రిన్ + ఇమిడాక్లోప్రిడ్ 0.15 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. లేదా 5 శాతం వేపగింజల కషాయం లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి గోలీకాయ దశలో 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. టెంక పురుగుల నివారణకు స్పైనటోరమ్ 1 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా సైహలోత్రిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి మార్చి మార్చి రెండుసార్లు గోలీకాయ దశ నుండి పిచికారి చేయాలి. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ఫిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 3 మి.లీ. కలిపి పిచికారి చేయాలి. పిందె రాలుటను నివారించుటకు 4.5 లీ. నీటిలో 1 మి.లీ. ప్లానోఫిక్స్‌ను కలిపి పిచికారి చేయాలి.

**జామ:** ఈ మాసంలో జామ పై ఆకు, కాయ మచ్చ తెగులు ఏర్పడి, ఏప్రిల్ నుండి ఆగష్టు వరకు ఉధృతి పెరుగుతుంది. ఆకుల కొన, అంచులు, మధ్య ఈనెల వద్ద గోధుమ, నలుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 3-4 సార్లు పిచికారి చేయాలి.

**అరటి:** ఈ మాసంలో ఫ్లీ బీటిల్స్ ఉధృతి అధికంగా ఉంటుంది. ఇవి విచ్చుకొనని లేత ఆకుల మీద కాయల మీద తింటూ, ఆకుల అడుగు భాగాన దాక్కుంటాయి. మధ్య ఆకు మీద వీటి ప్రభావం అధికంగా ఉంటుంది. కాయల మీద మచ్చలు ఏర్పడటం వల్ల మార్కెటింగ్‌కు పనికిరావు. కొత్తగా వచ్చే ఆకుల మీద క్లోరిపైరిఫాస్ 20% ఇసి 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** ఈ నెలలో ఎండ తీవ్రత పెరుగుతుంది. కాబట్టి మొక్క వయస్సు, నేల స్వభావాన్ని బట్టి మొక్కకు నీటిని తగు మోతాదులో అందించాలి. 1-4 సంవత్సరాల వయస్సు గల మొక్కకు రోజుకు 30 లీటర్లు, 5-7 సంవత్సరాల మొక్కకు రోజుకు 250 లీటర్లు, 8 సంవత్సరాల పైన ఉన్న మొక్కకు రోజుకు 150 లీటర్ల వరకు నీటిని ప్రతిరోజు అందించాలి. పిందె రాలటంను నివారించుటకు 2,4-డి 1 గ్రా. యూరియా 1 కిలో, కార్బండాజిమ్ 100 గ్రా. లను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** పండ్లలో నాణ్యతను పెంచేందుకు నీటిని తగ్గించాలి. ఎకరాకు 60 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. పండ్ల పరిమాణం 7-8 మి.మీ. ఉన్నప్పుడు 2 పిపియం ఇథరిల్ మరియు 40 పిపియం జిబ్బరెల్లిక్ ఆమ్ల ద్రావణంలో గుత్తులను ముంచాలి. ఇలా చేయడం వల్ల పండ్ల రంగు మరియు పరిమాణం పెంచవచ్చు.

**బొప్పాయి:** పండు ఈగ నివారణకు చెట్ల క్రింద రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. మిథైల్ యుజినాల్ ఎరను ఉపయోగించి ఆకర్షించబడిన మగ పురుగులను నాశనం చేయాలి. 1 మి.లీ. మిథైల్ యుజినాల్, 2 గ్రా. కార్బోఫ్యూరాన్ ఒక లీటరు నీటిలో కలిపి వెడల్పాకు మట్టి పళ్ళాలలో పోసి అక్కడక్కడ ఉంచాలి.





**జీడి మామిడి:** కాయ, గింజ తినే పురుగు కాయ, గింజ మధ్య గల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటుంది. వీటి నివారణకు ఈ మాసంలో లామ్డాసైహలోత్రిన్ 0.6 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ఆపిల్, రేగు:** పెరిగిన చెట్లను ఈ మాసంలో కత్తిరింపు చేయాలి. ప్రతి కొమ్మ 15–20 కణుపుల నుండి కత్తిరించాలి. కత్తిరింపులకు ముందుగా 10 గ్రా. పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల త్వరగా చిగురిస్తాయి.

**కూరగాయలు:**

**టమాట:** కాయతొలుచు పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. మందును లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. వేసవి టమాటా నాటిన 30,45 రోజులకు లీటరు నీటికి 5 గ్రా. జింక్ సల్ఫేట్, కలిపి పిచికారి చేసినట్లైతే 20% దిగుబడి పెరుగుతుంది. పూత దశలో లీటరు నీటికి 20 గ్రా. యూరియాను కలిపి పిచికారి చేస్తే 20 శాతం దిగుబడి పెరుగుతుంది.

**వంగ:** విత్తిన 30వ, 45వ రోజున ఎకరాకు 50 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. పంట పూత దశలో లీటరు నీటికి 10 గ్రా. యూరియా కలిపి పిచికారి చేయడం వల్ల 25% నత్రజని ఆదాతో పాటు అధిక దిగుబడి పొందవచ్చు. అలాగే లీటరు నీటికి 5 గ్రా. సూక్ష్మపోషక పదార్థాల మిశ్రమాన్ని పిచికారి చేయడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చు.

మొవ్వు మరియు కాయతొలుచు పురుగుల నివారణకు సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో కాయలు కోసిన తరువాత పిచికారి చేయాలి.

**మిరప:** కాయలు కోసే ముందు సస్యరక్షణ మందులను పిచికారి చేసుకోకూడదు. అఫ్లోటాక్సిన్లు వృద్ధి చెందకుండా మిరప కాయలను పాలిథీన్ పట్టా మీద ఎండబెట్టాలి. రాత్రిళ్ళు మంచు బారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి. అవకాశమున్న చోట శీతల గిడ్డంగులలో నిల్వ చేస్తే రంగు, నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది.

**పందిరి కూరగాయలు:** పెంకు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటిలో 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి. పేనుబంక పురుగుల నివారణకు లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.25 గ్రా. కలిపి పిచికారి చేయాలి. పెరుగుదల దశ నుండి పూత వచ్చే వరకు 5 శాతం వేపగింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ఈ పంటలపై గంధకం సంబంధిత పురుగు, తెగుళ్ళ మందులు వాడరాదు. దీని వల్ల ఆకులు మాడిపోతాయి.

**ఆకుకూరలు:** ఆకు కూరలకు తక్కువ మందు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. అవశేషాలు గల పురుగుమందులను మాత్రమే వాడాలి. పేనుబంక మరియు ఆకు తినే గొంగళి పురుగుల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు మందు పిచికారి చేసిన తరువాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9441168156**



# కరివేపాకును ఆశించే పురుగులు, తెగుళ్ళు - నివారణ మరియు వాటి నియంత్రణలో పాటించవలసిన సురక్షిత కాలం



డా॥ కె. వాణిశ్రీ, డా॥ జి. శ్రీదేవి, డా॥ యస్. ఉపేంధర్, డా॥ రాజశేఖర్,
డా॥ సి. స్వాతి, డా॥ అపర్ణ, డా॥ డి. రాకేష్ మరియు డా॥ యం. అరుణ
సస్యరక్షణ మందుల అవశేషాల విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్

కరివేపాకు భారతీయ వంటకాల్లో విడదీయరాని భాగం. రోజూవారి కోత ఉండే ఈ పంటకు మార్కెట్ డిమాండ్ ఎక్కువయితే సరైన సంరక్షణ లేక పురుగులు, తెగుళ్ళు దాడి చేసి దిగుబడిని గణనీయంగా తగ్గిస్తాయి. ముఖ్యంగా కరివేపాకు నేరుగా ఆహారంలో వాడే పంట కావడం వల్ల సురక్షిత పురుగు నియంత్రణ అత్యంత అవసరం.

### కరివేపాకును పురుగులు మరియు తెగుళ్ళు ఎక్కువగా ఆశించడానికి గల కారణాలు:

- అధిక నత్రజని ఎరువులు వాడటం వలన
- సరైన అంతర పంటలు పండించక పోవడం వలన
- ఎక్కువ తేమ మరియు నీటి నిల్వ వలన
- ఒకే రకమైన మందును పదే పదే వాడటం వలన

### కరివేపాకును ఆశించే పురుగులు:

**1. ఆకులు తినే పురుగు:** ఈ పురుగు యొక్క పిల్ల పురుగులు ఆకుల అంచుల నుండి పూర్తిగా తినివేయడం వలన మొక్క బలహీనంగా మారటం మరియు కొత్త కొమ్మల పెరుగుదల నశిస్తుంది. వీటి నివారణకు గ్రుడ్లను మరియు పిల్ల పురుగులను చేతితో తొలగించాలి. వేప సంబంధిత మందులైన అజాడిరాక్టిన్ 1500 పిపియం 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే దీపపు ఎరలను అమర్చాలి. ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. **సురక్షిత కాలం:** 7-10 రోజులు

**సైలా పురుగు (సిల్లిడ్స్):** తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల నుండి రసాన్ని పీల్చడం వలన కొత్త ఆకులు ముడుచుకుపోయి మొక్క పొదలా కాకుండా వంకరగా ఎదుగుతాయి. వీటి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను 10-15 ఎకరానికి అమర్చాలి. వేపగింజల కషాయాన్ని 5% పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నచో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వీటి సురక్షిత కాలం: 10-15 రోజులు

**పిండి పురుగులు:** పిల్ల మరియు తల్లి పురుగులు ఆకులు, కొమ్మల నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపుగా మారి రాలిపోతాయి. వీటి నివారణకు స్పైరోటెట్రామాట్ 0.5 మి.లీ. లేదా బుప్రోఫెజిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వీటి సురక్షిత కాలం: 10-14 రోజులు.

### కరివేపాకు పంటను ఆశించు తెగుళ్ళు:

**1. ఆకుమచ్చ తెగులు:** ఆకులపై గోధుమ లేదా నల్ల మచ్చలు ఏర్పడుతాయి. మచ్చలు పెద్దవై ఆకులు ఎండిపోవడం వలన నాణ్యత మరియు దిగుబడులు విపరీతంగా తగ్గుతాయి. నివారణకు నీటిని నిల్వ లేకుండా మురుగునీటి కాలువలను ఏర్పరచాలి. తెగులు ఆశించిన ఆకులను త్రుంచి కాల్చివేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నచో మ్యాంకోజెబ్ 2 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వీటి సురక్షిత కాలం: 7-10 రోజులు.

**2. వేరుకుళ్ళు తెగులు:** ఈ తెగులు ఆశించినచో మొక్క ఆకస్మాత్తుగా వాడిపోతుంది. వాడిపోయిన మొక్కను పీకినచో వేర్లు నల్లగా కుళ్ళిపోవడం గమనించవచ్చును. దీని నివారణకు ట్రైకోడెర్మా విరిడె 5 కిలోలు ఎకరానికి వాడాలి మరియు శుభ్రమైన నీటిని మొక్కలకు అందించాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నచో కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. **సురక్షిత కాలం : 15 రోజులు.**

సురక్షిత కాలం అంటే పురుగు మందు పిచికారి చేసిన తర్వాత కోతకు మధ్య తప్పనిసరిగా వేచి ఉండాల్సిన రోజులు. సస్యరక్షణ మందుల సురక్షిత కాలం చాలా ముఖ్యం ఎందుకంటే కరివేపాకును నేరుగా వంటలో వాడుతారు. దాని వలన మందుల అవశేషాలు ఆరోగ్యానికి హానికరం.

### రైతులకు ముఖ్య సూచనలు:

- ఒకే మందును వరుసగా వాడవద్దు.
- కోతకు ముందు తక్కువ విషపూరిత మందులు వాడాలి.
- వీలైనంత వరకు సేంద్రియ పద్ధతులు పాటించాలి.
- సస్యరక్షణ మందులు ఉదయం లేదా సాయంకాలం పిచికారి చేయాలి.

కరివేపాకు సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చు ఆరోగ్యకరమైన మరియు మార్కెట్ విలువ కలిగిన పంటను పొందవచ్చు. ముఖ్యంగా సురక్షిత కాలం పాటించడం రైతు బాధ్యత మాత్రమే కాక వినియోగదారుల ఆరోగ్యానికి రక్షణ.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9494407924

# పండ్ల తోటలలో కాయ పగుళ్ళ కారణాలు - నివారణ చర్యలు

యల్. సుహాసిని, డి. అశ్విని మరియు బి. క్రాంతి కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల్





పండ్ల తోటలలో కాండం పగుళ్ళు అనేది ఒక ప్రధాన సమస్య. దీనివలన మార్కెట్ విలువ తగ్గటంతో పాటు పంట దిగుబడిని కూడా ప్రభావితం చేస్తుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిని సరియైన సమయంలో నియంత్రించుకుంటే పగుళ్ళ నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. ఈ సమస్య ప్రధానంగా దానిమ్మ, ద్రాక్ష, నేరేడు, మామిడి, జామ వంటి పండ్లలో అధికంగా కనిపిస్తుంది.

**కాయ పగుళ్ళకు ప్రధాన కారణాలు:**

1. వాతావరణ పరిస్థితులు
2. అసమతుల నీటి సరఫరా
3. ఫలాభివృద్ధి దశలో వర్షాలు
4. పోషకాల లోపాలు
5. చెట్టు జన్యు లక్షణాలు
6. ఉష్ణోగ్రతలో మార్పులు
7. చెట్ల మధ్య పోటీ
8. హార్మోన్ల అసమతుల్యత
9. చెట్ల వయస్సు
10. కాయ లక్షణాలు
11. ఇతర కారణాలు

**1. వాతావరణ పరిస్థితులు:** ఉష్ణోగ్రత, కాంతి, ఆర్ధ్రతలో అసమతుల్యతలు కాయ పగుళ్ళకు ప్రధాన కారణం. శుష్క మరియు పాక్షిక శుష్క-ప్రాంతాల్లో తక్కువ ఆర్ధ్రత మరియు ఎక్కువ/అధిక ఉష్ణోగ్రతలు కాయ పగుళ్ళకు ప్రధాన కారణం.

**ఉదా:** లిచ్చి

ఉష్ణోగ్రత 10-40$^0$ సెం. మించి పెరిగితే లిచ్చి, చెర్రీ, సిట్రస్‌లలో కాయ పగుళ్ళు వస్తాయి.

**2. అసమతుల నీటి సరఫరా:** పొడి వాతావరణంలో నీటి కొరత తర్వాత లేదా ఎక్కువ రోజులు పంటకు నీటిని అందివ్వకుండా, ఒక్కసారిగా ఎక్కువ నీరు అందించిన లేదా వర్షాలు పడిన కాయ పగుళ్ళు వస్తాయి.

**3. ఫలాభివృద్ధి దశలో వర్షాలు:** ఫలాభివృద్ధి దశలో అధిక వర్షాలు పడటం వలన కాయలు నీటిని శీఘ్రంగా గ్రహించి పగుళ్ళు సంభవిస్తాయి.

**4. పోషకాల లోపాలు:** కాల్షియం మరియు బోరాన్ వంటి ఖనిజాల లోపం వలన కాయ గట్టిదనాన్ని కోల్పోయి పగులుతాయి. దానిమ్మ, లిచ్చి, చెర్రీలలో ఈ కారణం వలన కాయలో పగుళ్ళు సంభవిస్తాయి. ఖనిజ లవణాల అసమతుల్యత అనగా తక్కువ పొటాషియం, కాల్షియం మరియు ఎక్కువ ఫాస్ఫరస్‌ల వలన కూడా పగుళ్ళు వస్తాయి.

**5. జన్యు లక్షణాలు:** కొన్ని పండ్ల రకాలు సహజంగానే పగిలే స్వభావాన్ని కలిగి ఉంటాయి.

**6. ఉష్ణోగ్రతలో మార్పులు:** వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతల వలన మరియు ఒక్కసారిగా ఉష్ణోగ్రత మారిపోవటం వలన ఫల పొరల్లో ఒత్తిడి ఏర్పడి పగుళ్ళు వస్తాయి.

**7. చెట్ల మధ్య పోటీ:** చెట్ల మధ్య మరియు కాయల మధ్య కాంతి నీరు, పోషకాల కోసం పోటీ వలన కాయలు సరిగా అభివృద్ధి చెందక పగిలిపోతూ ఉంటాయి.

**8. హార్మోన్లలో అసమతుల్యత:** హార్మోన్లు, కాయ పెరుగుదలకు, వృద్ధికి దోహదపడతాయి. ఏవైతే పండ్ల రకాలు తక్కువ స్థాయిలో హార్మోన్లను కలిగి ఉంటాయో ఆ రకాలు ఎక్కువగా కాయ పగుళ్ళకు గురైతాయి. కాయ యొక్క తోలు గట్టితనం, పండ్లలో జిబ్బరెల్లిన్, సైటోకైనిన్‌ల శాతం పై ఆధారపడి ఉంటుంది.

**9. చెట్లు వయస్సు:** ముదురు వయస్సు మొక్కల కంటే లేత మొక్కలపై ఉన్న పండ్లు ఎక్కువ పగుళ్ళకి గురవుతాయి. బోరాన్ లోపం వలన లేత చెట్లలలో ఇలా జరుగుతుంది. ముదురు చెట్లలో అసమతుల్య తేమ వలన, ఆకస్మిక వర్షాలు, ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ నీటి పారుదల పగటి-రాత్రి ఉష్ణోగ్రతలలో తేడాల వలన కాయలలో పగుళ్ళకి కారణమవుతాయి.

**10. కాయ లక్షణాలు:** పక్వానికి వచ్చిన పండ్లు త్వరగా పగుళ్ళకి గురైతాయి. కాయ యొక్క పరిమాణం, ఆకారం కూడా కాయ పగుళ్ళ రేటును ప్రభావితం చేస్తాయి. చిన్న పరిమాణం గల కాయలతో పోలిస్తే, పెద్ద పరిమాణం గల పండ్లు పగుళ్ళకి ఎక్కువగా గురవుతాయి. మెత్తటి కండ గల పండ్ల కంటే, గట్టికండ గల పండ్లు ఎక్కువగా పగుళ్ళకి గురవుతాయి. ఉదా: లిచ్చి మరియు చెర్రీ

**11. ఇతర కారణాలు:** చెట్లపై కాయలు ఎక్కువగా ఉన్న కూడా అవి పగుళ్ళకి గురవుతాయి. కాయ పలుచని తోలును కలిగి ఉన్నా కూడా పగుళ్ళకి కారణమవుతుంది.

## నివారణ చర్యలు:

### 1. నీటి యాజమాన్యం:

- నేలలో తగినంత తేమని ఉంచటం వలన కాయల్లో పగుళ్ళను తగ్గించవచ్చు. ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే మే, జూన్ మాసాల్లో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.
- డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండ్ల తోటలలో సమర్థవంతంగా నీటిని నియంత్రించవచ్చును.
- పండ్ల తోటలలో మల్చింగ్ వేసుకోవడం వలన నేలలో తేమని నిలుపుకునేలా చేస్తుంది.

### 2. పోషకాలను అందించడం:

- సంత్రాలలో పూత చివరి దశలో పొటాషియం నైట్రేట్ 2% + 2,4-డి (100 మి.గ్రా/లీ.)ని పిచికారి చేసినట్లైతే, కాయ పగుళ్ళను తగ్గించవచ్చు.
- దానిమ్మలో 0.2% బోరాన్ డ్రిప్ ద్వారా ఇచ్చినట్లైతే, కాయ పగుళ్ళ సమస్యను తగ్గించవచ్చు.
- బోరాన్ 0.2%, కాల్షియం నైట్రేట్ 0.5% వర్షం తర్వాత లేదా ముందు పిచికారి చేయడం వలన కాయ పగుళ్ళను తగ్గించవచ్చు.
- కాల్షియం, బోరాన్‌ని, పొటాషియం వంటి ఖనిజ లవణాలను ఫలాభివృద్ధి దశలో పిచికారి చేయడం వలన పండ్ల తొక్క బలపడుతుంది. దాని వలన పగుళ్ళను నివారించవచ్చును. దానిమ్మలో జిబ్బరెల్లిక్ ఆమ్లం 150 పిపియం కోతకు ముందు పిచికారి చేసినట్లైతే, కాయ పగుళ్ళను తగ్గించవచ్చు.

### 3. ఇతర నివారణ చర్యలు:

- పక్వత దశలో పగుళ్ళను నివారించుటకు పండ్లను పాలిథీన్ కవర్లతో కప్పి ఉంచాలి. దీనివలన వాటిని వర్షాలు, కీటకాలు, ఉష్ణోగ్రత మార్పుల నుండి రక్షణ కల్పించవచ్చును.
- ఉష్ణోగ్రతల నుండి తట్టుకునేందుకు యాంటీ ట్రాన్సిపరెంట్స్‌ను పిచికారి చేయవలెను.
- పగుళ్ళకి ప్రతిరోధకత కలిగిన రకాలను ఎంచుకోవటం ఉత్తమైన పద్ధతి. ఉదా॥ దానిమ్మలో జ్యోతి రకం పగుళ్ళకు తక్కువగా గురవుతుంది.

పైన తెలిపిన చర్యల వలన పగుళ్ళను పూర్తిగా నివారించడం సాధ్యపడకపోయినా, వాటి శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. సమయానికి నీటి నిర్వహణ, పోషక నిర్వహణ, వాతావరణాన్ని అనుసరించి తగిన నిబంధనలను పాటించడం ద్వారా నష్టాన్ని నియంత్రించవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9160760095**

# ఔషధ గుణాలు కలిగిన ఆహారం: ఆరోగ్య పెన్నిధి మునగ ఆకులు

డా॥ జెస్సీ సునీత దబ్బు, డా॥ జి. స్వరూప రాణి, డా॥ ఆర్. నీలా రాణి, డా॥ శ్వేత కోడాలి మరియు డా॥ లక్ష్మి చల్లా

ఏ.ఐ.సి.ఆర్.పి – వ్యవసాయంలో మహిళలు, పి.జె.టి.ఏ.యు, రాజేంద్రనగర్





**పరిచయం:**

మునగ చెట్టు (మోరింగ ఒలిఫెరా) దక్షిణ ఆసియాకు చెందిన మొక్క. ఇది ప్రపంచంలోని ఉష్ణమండల మరియు ఉపఉష్ణమండల ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. మునగ చెట్టు మోరింగేసి కుటుంబానికి చెందింది. దీనిని సాధారణంగా అద్భుత చెట్టు, బెన్ ఆయిల్ చెట్టు లేదా గుర్రపు ముల్లంగి చెట్టు అని కూడా పిలుస్తారు. మునగ చెట్టు తీవ్రమైన కరువు పరిస్థితులను, అలాగే తేలికపాటి మంచును కూడా తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. ఇందులో పోషక విలువలు అధికంగా ఉండటం వల్ల చెట్టు యొక్క ప్రతి భాగం పోషక మరియు వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఇది సన్నని కాండంతో ఉండే ఆకురాల్చే చెట్టు, సుమారు 10–12 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది మరియు కాండం వ్యాసం సుమారు 45 సెం.మీ. వరకు ఉంటుంది.

సాధారణంగా మునగ నాటిన ఆరు నెలల్లోనే పుష్పించడం ప్రారంభిస్తుంది. వాతావరణం అనుకూలంగా ఉండి నీటి వనరులు సమృద్ధిగా ఉన్నప్పుడు సంవత్సరానికి రెండుసార్లు లేదా సంవత్సరమంతా పుష్పిస్తుంది.

మునగ ఆకుల్లో ఖనిజాలు, విటమిన్లు మరియు ముఖ్యమైన వృక్ష రసాయనాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఆకులను పోషకాహార లోప నివారణకు, అలాగే బాలింతల్లో పాల ఉత్పత్తి పెంచడానికి ఉపయోగిస్తారు. మునగ మొక్కకు యాంటీ ఆక్సిడెంట్, యాంటీ–ఇన్ఫ్లమేటరీ, యాంటీ–డయాబెటిక్, యాంటీ–మైక్రోబయల్ మరియు క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నట్లు గుర్తించారు.

**పోషక విలువలు:**

100 గ్రా. ముడి మునగ ఆకులు 64.0 కిలో కేలరీలు, 1.4 గ్రా. కొవ్వు, 9.4 గ్రా. మాంసకృత్తులను మరియు 8.3 గ్రా. పిండిపదార్థాలను కలిగి ఉంటాయి, వీటిలో 2.0 గ్రా. పీచుపదార్థము మరియు సంక్లిష్ట పిండిపదార్థాలు ఉన్నాయి. ఇది 7564.0 ఐయు విటమిన్ ఎ, 51.7 మి.గ్రా. విటమిన్ సి, 4.0 మి.గ్రా. ఇనుము, 185.0 మి.గ్రా. కాల్షియం మరియు 337.0 మి.గ్రా. పొటాషియంను అందిస్తుంది.

**ఆహార ప్రయోజనాలు:**

- మునగ ఆకులను టెంపోరాలిస్ మీద రుద్దడం వల్ల తలనొప్పి నుండి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది.
- యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉన్నందున ఈ ఆకులను గాయాలు లేదా క్రిమి కాటుపై పూయడం ప్రయోజనకరంగా ఉంటుంది.
- ఎండిన మునగ ఆకుల టీ ని గ్యాస్ట్రిక్ అల్సర్స్ మరియు డయేరియా యొక్క తీవ్రతను తగ్గించడంలో సహాయ పడుతుంది.
- యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల సాధారణ జ్వరాలు, బ్రోంకైటిస్, కంటి లేదా చెవి ఇన్ఫెక్షన్లు మరియు బాధాకరమైన శ్లేష్మ పొర వాపులకు చికిత్సగా మునగ ఆకులను ఉపయోగిస్తారు.

- ఇది వాపు (శోథం) తగ్గించే లక్షణాలు కలిగి ఉండటం వల్ల చర్మానికి క్రిమినాశకంగా పనిచేసి మొటిమలను నయం చేస్తుంది.
- క్యారెట్ మరియు మునగ ఆకుల మిశ్రమం ఆయుర్వేదంలో గనేరియా నివారణకు ఉపయోగిస్తున్నారు. జుట్టు రాలడం మరియు చుండ్రు చికిత్సకు కూడా ఇది సహాయపడుతుంది.
- మునగ ఆకులు ఇనుము కలిగి ఉంటాయి కాబట్టి ఆహారంలో దీనిని వాడడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు.

## మునగ ఆకుల ఆరోగ్య లాభాలు:

### ఆరోగ్యకరమైన గర్భం కొరకు:

మునగ ఆకులు తినడం గర్భిణీలకు మరియు బాలింతలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది కళ్ళు తిరగడం, వాంతులు వంటి గర్భధారణ లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ ఆకుల పొడిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుంది.

### బరువు తగ్గడం కొరకు:

మునగ ఆకుల్లో అధికంగా పీచు పదార్థం ఉండటం వల్ల ఇవి నీటిని పీల్చుకుని పొట్ట నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో అవసరానికి మించి ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. మునగ ఆకుల్లో ఉన్న క్లోరోజెనిక్ ఆమ్లం రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించి, కొవ్వును కరిగించడంలో సహాయపడటం ద్వారా బరువు తగ్గడంలో ఉపయోగపడుతుంది. ఇవి తక్కువ కేలరీలతో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. మునగ ఆకులను సూప్‌గా తీసుకోవడం వల్ల బరువు తగ్గేందుకు మరింత సహాయపడుతుంది.

### అధిక రక్తపోటును నియంత్రిస్తుంది:

మునగ ఆకులు అధిక రక్తపోటును సమర్థవంతంగా నియంత్రించడంలో సహాయపడతాయి. అధిక రక్తపోటు నియంత్రణలో లేకపోతే అది గుండె జబ్బులు, రక్తప్రసరణ లోపాలు, అలాగే గుండె మరియు మూత్రపిండాల వ్యాధులకు ప్రధాన కారణంగా మారుతుంది. కాబట్టి మునగ ఆకుల్లో రక్తపోటును నియంత్రించడంలో సహాయపడే కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్ మరియు విటమిన్-ఇ వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అదేవిధంగా, మునగ ఆకుల్లో ఉన్న విటమిన్-సి రక్తనాళాల ఆరోగ్యానికి అవసరమైన నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని కారణంగా రక్తనాళాలు విస్తరించి, వాటిపై ఒత్తిడి తగ్గి రక్తపోటును సాధారణ స్థాయిలో ఉంచుతుంది.

### ఆరోగ్యకరమైన జుట్టు కొరకు:

జుట్టు రాలడాన్ని నియంత్రించడానికి మరియు జుట్టు కుదుళ్లకు రక్తప్రసరణను ప్రోత్సహించడానికి విటమిన్-ఇ, బయోటిన్, విటమిన్-బి6 మరియు ఫోలిక్ ఆమ్లం చాలా అవసరం. అలాగే సిలికా, జింక్ వంటి ఖనిజాలు మరియు విటమిన్-ఇ, ఏ, బీ లు సమృద్ధిగా ఉండటం వల్ల జుట్టు సహజంగా పెరుగుతుంది. ఇవి చుండ్రు సమస్యను తగ్గించి, జుట్టు రాలడాన్ని నివారించి, బలమైన మరియు ఆరోగ్యకరమైన జుట్టును అందిస్తాయి.

### రుమటాయిడ్ ఆర్థరైటిస్ తగ్గించుటకు:

మునగ ఆకుల సారం వాపు మరియు నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిలో యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కలిగిన ఫైటోకెమికల్స్ సమృద్ధిగా ఉంటాయి. మునగ ఆకుల్లో నారింజ కంటే సుమారు 7 రెట్లు ఎక్కువ విటమిన్-సి, అరటి కంటే సుమారు 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఉంటుంది. అలాగే కాల్షియం, ఐరన్ మరియు అవసరమైన అమైనో ఆమ్లాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉండి కణాలు దెబ్బతినకుండా కాపాడటంతో పాటు శరీర రోగనిరోధక శక్తిని పెంచి, రుమటాయిడ్ ఆర్థరైటిస్ లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి.

## ఆకులను వివిధ ఆహార పదార్థాల తయారీకి వాడవచ్చు:

- ఆకులను వండుకోవచ్చు, బచ్చలికూర లేదా ఇతర ఆకుకూరల మాదిరిగా పప్పుల్లో వేసి ఉపయోగించవచ్చు.
- ఎండబెట్టి పిండిచేసిన ఆకుల పొడిని సాస్, సూప్‌లలో లేదా కరివేపాకు కారం పొడిలా కారం రూపంలో ఉపయోగించవచ్చు.
- ఎండిన లేదా తాజా ఆకులతో టీ తయారు చేయవచ్చు; ఇది యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది.
- వడలు మరియు పరాటాలు లాంటి వంటకాలలో ఈ ఆకులను కలపవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849308363**

# కొర్రమేను చేపల పెంపకం

డా॥ జి. గణేష్ మరియు డా॥ యస్. బిందు మాధురి

కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు, పి.వి. నరసింహ రావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, వరంగల్





తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం మాత్రమే కాదు, మత్స్య సాగు కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఒక బలమైన ఆధారంగా మారుతోంది. మారుతున్న ఆహార అలవాట్లు, పెరుగుతున్న ప్రోటీన్ అవసరాలు, ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన ఇవన్నీ కలిసి చేపల వినియోగాన్ని రోజురోజుకీ పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు స్థిరమైన ఆదాయం అందించగల కొన్ని ప్రత్యేక జాతి చేపలు ఇప్పుడు విశేష ప్రాధాన్యం సంపాదిస్తున్నాయి. అలాంటి చేపల్లో కొర్రమేను చేపల పెంపకం ఒక లాభదాయక మత్స్య సాగు విధానంగా ఎదుగుతోంది.

రుచిలో ప్రత్యేకత, పోషక విలువల్లో సమృద్ధి, మార్కెట్లో ఎప్పటికీ ఉండే డిమాండ్ ఈ మూడు లక్షణాల కలయికే కొర్రమేను చేపల ప్రత్యేకత. మన ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానికంగా "బొమ్మె చేపలు" అని పిలవబడే ఈ చేపలు, సంప్రదాయ వైద్యపరమైన విలువతో పాటు మంచి వాణిజ్య అవకాశాలను కూడా అందిస్తున్నాయి. సరైన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ నిర్వహణ ఉంటే, తక్కువ పెట్టుబడితో కూడా ఈ చేపల పెంపకం ద్వారా రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది.

## కొర్రమేను చేపల ప్రత్యేక లక్షణాలు –ఎందుకు ఇవే సరైన ఎంపిక?

కొర్రమేను చేపలు మాంసాహారి స్వభావం కలిగినవి. ముఖ్యమైన ప్రత్యేకత ఏమిటంటే ఇవి తక్కువ ఆక్సిజన్ ఉన్న నీటిలో కూడా జీవించగలవు. ప్రతికూల పరిస్థితులను తట్టుకునే శక్తి వీటికి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాలలో కూడా ఈ చేపల పెంపకం సులభంగా చేయవచ్చు. కొత్తగా మత్స్య సాగు ప్రారంభించాలనుకునే రైతులకు ఇది ఒక మంచి ఎంపికగా నిలుస్తోంది. కొర్రమేను చేపలను పెద్ద చెరువులలోనే కాకుండా, చిన్న చెరువులు, నీటి గుంటలు, బావులు, సిమెంట్ ట్యాంకులు, బయోఫ్లాక్ యూనిట్లలో కూడా విజయవంతంగా పెంచవచ్చు.

తక్కువ భూమి, పరిమిత నీటి వనరులు ఉన్న రైతులు, గ్రామీణ యువత, మహిళలు ఈ పెంపకాన్ని స్వయం ఉపాధి మార్గంగా తీసుకోవచ్చు. ఇది గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

## చెరువును సిద్ధం చేసుకునే విధానం

కొర్రమేను చేపల పెంపకంలో మంచి దిగుబడి సాధించాలంటే, చెరువు నేల మరియు చెరువును శాస్త్రీయ పద్ధతిలో ముందుగానే సిద్ధం చేసుకోవడం అత్యంత అవసరం. ముందుగా చెరువు నీటిని పూర్తిగా వదిలి, చెరువు నేలను ఎండబెట్టి, అడుగున పేరుకుపోయిన మట్టి ముద్దలు, కుళ్ళిపోయిన సేంద్రీయ పదార్థాలు, అవాంఛిత చేపలు మరియు కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలి. చెరువు నేల ఎండిన తరువాత నేల స్వభావాన్ని బట్టి సున్నం వేసి ఉదజని విలువను 7.0–8.0 మధ్య స్థిరంగా ఉంచాలి. ఈ ప్రక్రియ వల్ల చెరువు నేలలో హానికర సూక్ష్మజీవులు నశించి, మట్టి నిర్మాణం మెరుగుపడి, నీటిలో పోషక పదార్థాల లభ్యత పెరుగుతుంది. అనంతరం సేంద్రీయ మరియు

రసాయన ఎరువుల సమతుల్య వినియోగం ద్వారా చెరువులో సహజ ఆహారం అయిన ప్లాంక్టన్ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. ఈ విధంగా శాస్త్రీయంగా సిద్ధం చేసిన చెరువు మాత్రమే కొర్రమేను చేపల వేగవంతమైన పెరుగుదలకు ఉపయోగపడుతుంది.

### ఆరోగ్యకరమైన చేప పిల్లల ఎంపిక వాటి- లక్షణాలు

కొర్రమేను చేపల పెంపకంలో పిల్లల ఎంపిక చాలా ముఖ్యం. ఆరోగ్యంగా, చురుకుగా కదిలే, గాయాలు లేని పిల్లలను మాత్రమే ఎంపిక చేయాలి. సాధారణంగా హెక్టారుకు 8,000 నుండి 10,000 వరకు పిల్లలను చెరువులో నిలువ చేయవచ్చు. చెరువులో వదిలే ముందు పిల్లలను ఉప్పు నీటిలో లేదా 10 పి.పి.యం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంలో 3 నుండి 5 నిమిషాలు ముంచితే బ్యాక్టీరియా మరియు పరాన్న జీవుల నుంచి వచ్చే వ్యాధులను తగ్గించే అవకాశం ఉంది.

### ఆహార యాజమాన్యం

కొర్రమేను చేపల పెంపకంలో ఆహార యాజమాన్యం దిగుబడిని నిర్ణయించే ప్రధాన శాస్త్రీయ అంశంగా నిలుస్తుంది. ఇవి మాంసాహారి స్వభావం కలిగిన చేపలు కావడంతో, వాటి జీవన దశకు అనుగుణంగా సరైన ప్రోటీన్, కొవ్వు, కార్బోహైడ్రేట్లు, ఖనిజ లవణాలు మరియు విటమిన్లు సమతుల్యంగా ఉండే మేతను ఎంపిక చేయాలి. ప్రారంభ దశలో వేగవంతమైన శరీర అభివృద్ధికి 42 శాతం వరకు ప్రోటీన్ కలిగిన మేత అవసరమైతే, పెరుగుదల దశలో 38-40 శాతం ప్రోటీన్ ఉన్న మేత సరిపోతుంది. మేత కణాల పరిమాణం చేపల నోటి పరిమాణానికి అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. మేతను రోజుకు రెండు సార్లు, ఉదయం మరియు సాయంత్రం సమయాల్లో, చేపల శరీర బరువుకు 5 శాతం మోతాదులో ఇవ్వాలి. ప్రతి 10-15 రోజులకు ఒకసారి నమూనా చేపలను తూకం వేసి, శరీర బరువు మార్పును బట్టి మేత మోతాదును సర్దుబాటు చేయడం శాస్త్రీయంగా అవసరం. అధికంగా మేత ఇవ్వడం వల్ల మిగిలిన మేత నీటిలో కుళ్లి అమ్మోనియా, నైట్రైట్ స్థాయిలు పెరిగి, నీటి నాణ్యత క్షీణించి, చేపల శ్వాసక్రియ మరియు రోగ నిరోధక శక్తి దెబ్బతింటాయి. అదే విధంగా నాణ్యతలేని లేదా ఫంగస్ పట్టిన మేత వాడటం వల్ల కాలేయ వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు మరియు మరణాల శాతం పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల నాణ్యమైన మేత నిల్వ, సరైన మోతాదు, సమయపాలన, నీటి నాణ్యత పర్యవేక్షణ ఈ నాలుగు అంశాలను సమన్వయంగా పాటించినప్పుడే కొర్రమేను చేపల పెంపకంలో ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు అధిక దిగుబడి సాధ్యం అవుతుంది.

### నీటి యాజమాన్యం

కొర్రమేను చేపల పెంపకంలో నీటి యాజమాన్యం ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు అధిక దిగుబడికి పునాదిగా నిలుస్తుంది. చెరువులో నీటి లోతు సాధారణంగా 1.5 నుండి 2 మీటర్ల వరకు ఉండేలా చూసుకోవాలి, తద్వారా ఉష్ణోగ్రత స్థిరంగా ఉండి, ఆక్సిజన్ మార్పిడికి అనుకూలంగా ఉంటుంది. నీటి ఉదజని విలువ 7.0 నుండి 8.0 మధ్య, ద్రవీభవించిన ఆక్సిజన్ స్థాయి లీటరుకు కనీసం 4-5 మి.గ్రా. కంటే తక్కువ కాకుండా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలి. అమ్మోనియా, నైట్రైట్ వంటి విష వాయువులు పేరుకుపోకుండా ఉండేందుకు ప్రతి వారం 10-20 శాతం వరకు తాజా నీటిని మార్పిడి చేయడం శాస్త్రీయంగా అవసరం. అధిక మేత, అధిక చేపల సాంద్రత వల్ల నీరు త్వరగా కలుషితం అవుతుందనగా, నీటి పారదర్శకతను సెకీ డిస్క్ ద్వారా 30-40 సెం.మీ. మధ్య ఉంచడం ఉత్తమం. నెలకు ఒకసారి సున్నం లేదా అనుకూలమైన ప్రోబయోటిక్స్ వాడటం వల్ల చెరువులో సూక్ష్మజీవుల సమతుల్యత మెరుగుపడి, హానికర బ్యాక్టీరియా పెరుగుదల నియంత్రించబడుతుంది.

### ఆరోగ్య యాజమాన్యం

కొర్రమేను చేపల పెంపకంలో ఆరోగ్య యాజమాన్యం దిగుబడిని నిలబెట్టే అత్యంత కీలక అంశంగా ఉంటుంది. చెరువు నీటి నాణ్యత బాగోలేనప్పుడు బ్యాక్టీరియా, ఫంగస్ మరియు పరాన్నజీవుల వల్ల వ్యాధులు వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంటుంది. చేపల శరీరంపై తెల్లటి మచ్చలు, పుండ్లు, రెక్కలు కుళ్లిపోవడం, ఆహారం తినకపోవడం, నీటి పైకి వచ్చి గాలి పీల్చడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చర్యలు తీసుకోవాలి. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలుగా నెలకు ఒకసారి చెరువులో ఎకరానికి 200-250 కిలోల సున్నం వేయడం వల్ల నీటి ఉదజని స్థిరంగా ఉండి, హానికర సూక్ష్మజీవులు తగ్గుతాయి. పరాన్నజీవుల నియంత్రణకు 10 పి.పి.యం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణాన్ని చెరువులో సమానంగా చల్లవచ్చు. ఫంగస్ వ్యాధులు ఎక్కువగా ఉన్నప్పుడు 1-2 పి.పి.యం మాలకైట్ గ్రీన్ లేదా 3-5 పి.పి.యం ఫార్మాలిన్ ద్రావణాన్ని నిపుణుల సూచన మేరకు ఉపయోగించాలి. బ్యాక్టీరియా సంక్రమణలు ఉన్నప్పుడు ఆహారంలో కిలో మేతకు 3-5 గ్రా. ఆక్సిటెట్రాసైక్లిన్ లేదా డాక్సీసైక్లిన్ కలిపి 5-7 రోజులు ఇవ్వడం ఉపయుక్తంగా ఉంటుంది. అయితే అనవసరంగా మందులు వాడకుండా, వ్యాధి తీవ్రతను బట్టి మత్స్య నిపుణులు లేదా శాస్త్రవేత్తల సలహాతో మాత్రమే మందులు వాడటం అత్యంత అవసరం. శాస్త్రీయ ఆరోగ్య యాజమాన్యం పాటించినప్పుడే చేపల

మరణాల శాతం తగ్గి, ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు స్థిరమైన దిగుబడి సాధ్యమవుతుంది.

**దిగుబడి, ధరలు – లాభాల గణాంకాలు**

శాస్త్రీయ నిర్వహణతో ఎకరానికి 3 నుండి 4 టన్నుల వరకు దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో కొర్రమేను చేపలకు కిలోకు 350 నుండి 400 రూపాయల వరకు ధర లభిస్తోంది. ఈ ధరలను దృష్టిలో ఉంచుకుంటే, తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందే అవకాశం ఉంది.

మొత్తంగా చూస్తే కొర్రమేను చేపల పెంపకం శాస్త్రీయ పద్ధతులు పాటించినప్పుడు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే లాభదాయక మత్స్య సాగు విధానంగా మారుతుంది. చెరువు సిద్ధం నుంచి మొదలుకొని, సరైన మేత నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ముందస్తు ఆరోగ్య సంరక్షణ వరకు ప్రతి దశలో శ్రద్ధ వహించినప్పుడే మంచి దిగుబడి సాధ్యమవుతుంది. అనుభవంతో పాటు నిపుణుల సలహాలు తీసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే, తక్కువ పెట్టుబడితో కూడా ఎక్కువ లాభాలు పొందవచ్చు. గ్రామీణ రైతులు, యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొర్రమేను చేపల పెంపకాన్ని ఒక స్థిరమైన స్వయం ఉపాధి మార్గంగా అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షిద్దాం.





**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6281836891**

**మార్చి, 2026లో పి.జె.టి.ఎ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 04.03.2026 | మిరపలో నల్ల తామర పురుగుల యాజమాన్యం |
| | అంతర్జాతీయ మహిళ దినోత్సవం |
| 11.03.2026 | ఆయిల్‌పామ్‌లో కొమ్ముపురుగు నష్టాలు మరియు నివారణ |
| | వినియోగదారుల హక్కులు మరియు వాటి ప్రాముఖ్యత |
| 18.03.2026 | వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం |
| | నీటి ప్రాముఖ్యత మరియు నీటిని శుద్ధి చేసే పద్ధతులు |
| 25.03.2026 | నయా పైసల పంట – పుట్టగొడుగుల పెంపకం |
| | ఋతువిరతి సమయంలో పోషకాహారం |

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | **I. డి.డి. - యాదగిరి (రైతు నేస్తం): సాయంత్రం 5.00 - 5.30** | |
| 1 | 02.03.2026 | వేసవిలో సాగు చేసే నూనె గింజల పంటలలో చీడపీడల యాజమాన్యం | డా॥ కె. రాజశేఖర్, సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 9908556659 |
| 2 | 04.03.2026 | పసుపు తీత మరియు తీతానంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు | డా॥ బి. వెంకట్ రాజ్ కుమార్, శాస్త్రవేత్త (ఉద్యాన) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్, ఫోన్ నెం. 9866240346 |
| 3 | 16.03.2026 | వేసవిలో సాగు చేసే పంటలలో సమగ్ర సస్యరక్షణ | డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పరిగి, వికారాబాద్, ఫోన్ నెం. 9390898305 |
| 4 | 23.03.2026 | యాసంగి వరిలో సమగ్ర పోషక యాజమాన్యం | శ్రీమతి కె. సంధ్యారాణి, శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్, ఫోన్ నెం. 7207735341 |
| | | **II. టి-శాట్: (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 6.00 - 7.00** | |
| 1 | 02.03.2026 | యాసంగి వరిలో కలుపు మరియు పోషక యాజమాన్యం | డా॥ యం. పరిమళ కుమార్, శాస్త్రవేత్త (అగ్రానమి) వరి పరిశోధన విభాగం, ఏఆర్ఐ, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9948589387 |
| 2 | 09.03.2026 | వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు | డా॥ ఎస్.జి. మహాదేవప్ప, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, ఏ.ఆర్.ఐ., రాజేంద్రనగర్ ఫోన్ నెం. 9492359789 |
| 3 | 16.03.2026 | వరి విత్తనోత్పత్తిలో మెళకువలు | డా॥ బి. శ్రీనివాస్, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, ఫోన్ నెం. 9618391562 |
| 4 | 23.03.2026 | వేసవి అపరాల సాగులో తీసుకోవాల్సిన మెళకువలు | డా॥ జి. ఈశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 6281121529 |
| 5 | 30.03.2026 | సూక్ష్మనీటి సాగు యాజమాన్యము | డా॥ కె. సురేష్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) సహజ వనరులు మరియు పర్యావరణ కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9849213541 |
| | | **III. టి-శాట్: (శనివారం): సాయంత్రం 6.00 - 7.00** | |
| 1 | 07.03.2026 | యాసంగి పంటలలో పోషక యాజమాన్యం | డా॥ టి. అంజయ్య, ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) ఏఐసిఆర్‌పి ఆన్ వీడ్ మెనేజ్‌మెంట్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 8919716320 |
| 2 | 28.03.2026 | వేసవి పశుగ్రాస పంటల రకాలు మరియు యాజమాన్యం | డా॥ డి. పద్మజ, శాస్త్రవేత్త (బయోటెక్నాలజీ) ఏఐసిఆర్‌పి ఆన్ ఫోరేజ్ క్రాప్స్ యూనిట్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9959306929 |



# రైతన్నకో ప్రశ్న...

**డా॥ ఆర్. సునిత దేవి మరియు డా॥ సి. పద్మవేణి**
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. వరిలో ఆకులు సన్నగా పెరిగి తెల్లగా మారి విరిగిపోవటం, ఆకుల అంచుల దగ్గరలో రంధ్రాలు ఏర్పడటం, వెన్నుదశలో కొన్ని గింజలు పాలుపోసుకోక పాక్షికంగా తెల్లగా మారితే ఏ పురుగు ఆశించినట్లుగా భావించాలి?**

ఎ) ఉల్లికోడు
బి) తామర పురుగులు
సి) వరి ఈగ
డి) సుడిదోమ

**2. వేసవి పంటగా పెసర, మినుమును రైతులు ఎప్పటి వరకు వేసుకోవచ్చును?**

ఎ) మార్చి 15 వరకు
బి) ఏప్రిల్ చివరి వరకు
సి) ఫిబ్రవరి
డి) ఏదీకాదు

**3. గులాబిరంగు పురుగు వచ్చే సంవత్సరం వేసే ప్రత్తి పంటను ఆశించకుండా ఉండాలంటే ఏ సూచనలు పాటించాలి?**

ఎ) ప్రత్తి ఏరిన చేనులలో గొర్రెలను లేదా పశువులను మేపాలి
బి) గులాబిరంగు పురుగు ఆశించిన ప్రత్తిని ఎక్కువ రోజులు నిల్వ చేయకుండా త్వరగా అమ్మివేయాలి
సి) ప్రత్తి జిన్నింగ్ మిల్లుల లోపల, బయట గులాబి రంగు ఆశించిన ప్రత్తి గింజలు లేకుండా చూసుకోవాలి
డి) పైవన్నీ

**4. మిరపలో ఆకుముడత / జెమిని వైరస్ తెగులు వ్యాప్తికి కారణమైన రసంపీల్చే పురుగు ఏది?**

ఎ) తెల్లదోమ
బి) నల్లి
సి) తామర పురుగులు
డి) పచ్చదోమ

**5. మామిడిలో పిందె రాలటం తగ్గించడానికి ఈ క్రింద పేర్కొన్న ఏ హార్మోనును పిచికారి చేయాలి.**

ఎ) జిబ్బరెల్లిక్ యాసిడ్
బి) నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్
సి) ఆబ్సైసిక్ యాసిడ్
డి) పైవన్నీ

**6. జామ తోటలలో ఎండాకాలంలో వచ్చే పూతను అరికట్టుటకు క్రింది వాటిలో దేనిని పిచికారి చేయాలి?**

ఎ) 10% యూరియా
బి) 10% జింక్ సల్ఫేట్
సి) 10% పొటాషియం
డి) 10% మెగ్నీషియం

**7. ఐ.సి.ఏ.ఆర్ ఆధ్వర్యంలోని జాతీయ కలుపు మొక్కల పరిశోధన సంస్థ ఎక్కడ ఉన్నది?**

ఎ) భోపాల్
బి) న్యూఢిల్లీ
సి) జబల్‌పూర్
డి) పాట్నా

**8. డై కాల్షియం ఫాస్ఫేట్‌లో భాస్వరం ఎంత శాతం ఉంటుంది?**

ఎ) 24%
బి) 34%
సి) 12%
డి) 60%

**9. మనదేశంలో టీ ఉత్పత్తిలో అగ్రగామి రాష్ట్రం ఏది?**

ఎ) అస్సాం
బి) పంజాబ్
సి) కేరళ
డి) తమిళనాడు

**10. పురుగులలో నిరోధక శక్తి పెరగడానికి గల కారణాలు?**

ఎ) ఒకే రకం పురుగు మందును ఎక్కువ సార్లు వాడటం వలన
బి) నష్టం చేసే పురుగుతో పాటు మేలు చేసే పురుగులు కూడా చనిపోవడం వలన
సి) అప్రధానంగా ఉన్న పురుగులు సమస్యగా మారడం
డి) పైవన్నీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## నేల పరీక్షలు, స్థానిక వాతావరణ ప్రభావాలు, పంటల వ్యవస్థలు మరియు సేంద్రియ ఎరువుల వినియోగం

వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నేల ఆరోగ్య విభాగం, సి-నారే, పిజెటిఏయు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4-9 వరకు "నేల పరీక్షలు, స్థానిక వాతావరణ ప్రభావాలు, పంటల వ్యవస్థలు మరియు సేంద్రియ ఎరువుల వినియోగం" అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పరిశోధన సంచాలకులు డా॥ ఎం. బలరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా పంటల దిగుబడి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దీర్ఘకాలికంగా మెరుగు పడుతుందని, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, మరియు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాధించవచ్చని, ఈ రకమైన శిక్షణ ద్వారా స్వంతంగా లాబరేటరీని ఏర్పాటు చేసుకునే నైపుణ్యం పొందవచ్చని తెలిపారు.

తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు అసిస్టెంట్ మెంబర్ సెక్రటరీ డా॥ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానం చేరేలా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను రైతులకు చేరవేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు. డా॥ ఎం. జగన్ మోహన్ రెడ్డి, డైరెక్టర్, సి-హెచ్ఆర్డీ, పిజెటిఏయు, ఈ శిక్షణ కార్యక్రమం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## కిసాన మేళా మరియు ప్రదర్శన

వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగంలో ఫిబ్రవరి 13న సాంకేతిక నూతన వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన మేళా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పనిముట్లు మరియు యంత్రాల పరిశోధన విభాగం ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, డా॥ రాజయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయ రంగంలో యాంత్రికరణను ప్రోత్సహించాలని, వ్యవసాయ రంగంలో వ్యయం, కార్మికుల కొరత వాతావరణ మార్పుల నేపథ్యంలో నూతన యంత్రాలు, ఆధునిక పరికరాల వినియోగం పెరిగిందని, నూతన వ్యవసాయ పరికరాలతో విత్తనాలు, ఎరువులు వేయడం, పిచికారి, వరి కోత వంటి పనులను తక్కువ సమయంలో పూర్తి చేయడంలో సహాయపడతాయని, మధ్యతరహా రైతులకు ఉపయోగపడే వీటి వల్ల పంట దిగుబడి పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు మరియు వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుతిరుగుడు సాగుపై అవగాహన సదస్సు

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాలలో ఫిబ్రవరి 10న ప్రొద్దుతిరుగుడు సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో అధిక దిగుబడుల కోసం విత్తన ఎంపిక, సరైన విత్తే పద్ధతి, విత్తే దూరం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం మరియు తాలు గింజలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి మాగాణులో మరియు జీరో టిల్లేజ్ విధానంలో ప్రొద్దుతిరుగుడు సాగు, యాంత్రీకరణ ప్రాముఖ్యత, విత్తనోత్పత్తి మెళకువలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకం ద్వారా పేదరిక నిర్మూలన

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ మరియు నాగర్ కర్నూల్ జిల్లాలలో "గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ" (ఎస్ఇఆర్పి) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో తేనెటీగల పెంపకం ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమం చేపట్టదలచినందున, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా కలెక్టరు శ్రీ. జితేష్ వి. పాటిల్ గారి సూచన మేరకు "కృషి విజ్ఞాన కేంద్రం- కొత్తగూడెం శాస్త్రవేత్తలు" మరియు "హంబుల్ బీ" ప్రతినిధులు ఫిబ్రవరి 24న జిల్లాలోని వివిధ మండలాలు పర్యటించి, గ్రామస్తులతో చర్చించి, తేనెటీగల పెంపకానికి గల సాధ్యాసాధ్యాలను, గ్రామస్తుల అభిప్రాయాలను, వివిధ వృక్షజాతి అనుకూలతను, నీటిలభ్యతను, పంటల యాజమాన్య పద్ధతులను, క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అనంతరం, ఈ కార్యక్రమానికి అనువైన గ్రామాల వివరాలను, ఇతర అభిప్రాయాలను, జిల్లా కలెక్టరుకు వివరించి, తదనంతరం తేనెటీగల బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటుకు, ఎంపిక కాబడు గ్రామస్తుల ట్రైనింగ్ విషయాలు, మరియు తేనెటీగల పెంపకానికి సరిపడు ఇతర పంటల పెంపుదల ఆవశ్యకతను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ప్ల బాబు

# బజ్జి మిరప సాగుతో అధిక లాభం ఆర్జిస్తున్న రైతు విజయగాధ

డా॥ కె. అరుణ, డా॥ ఎ. నిర్మల మరియు కె. రాహుల్ విశ్వకర్మ

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సంగారెడ్డి





సంగారెడ్డి జిల్లా బడంపేట్ గ్రామానికి చెందిన తీగల బుచ్చిరెడ్డి అనే రైతు తనకు ఉన్న 6 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో నూతన సాగు విధానాలను అవలంబిస్తూ, సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపడుతూ బజ్జి మిరప సాగులో అధిక లాభాలను గడిస్తున్నారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సంగారెడ్డి శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగులో చేపట్టాల్సిన చర్యలు, సమగ్ర చీడపీడల మరియు తెగుళ్ళ యాజమాన్యం, సాంకేతికత విధానాలైన మల్చింగ్, డ్రిప్ మరియు ఫర్టిగేషన్ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను సాధిస్తున్నారు. మిరపలో మల్చింగ్ పద్ధతి వల్ల నీటి ఆదా, కలుపు నివారణ, నేల ఉష్ణోగ్రత నియంత్రణ, తెగుళ్ళు మరియు పురుగుల నుండి రక్షణ ఏర్పడిందని, రసాయన ఎరువులు అయినటువంటి 19-19-19, 13-0-45 మరియు 10-26-26 లను ఫర్టిగేషన్ విధానం ద్వారా అందించడం జరిగింది, దీని ద్వారా తన వద్ద ఉన్న కొద్ది నీటి వనరులతో 2 ఎకరాలలో బజ్జి మిరప పంట సాగు చేస్తూ నీటి వినియోగ సామర్థ్యంను పెంచడమే కాకుండా అధిక దిగుబడి సాధించడం జరిగింది. ఎత్తుమడుల పద్ధతి ద్వారా ఎకరానికి మొక్కల సంఖ్య సగటున 7,500 మొక్కలు వచ్చి, ఏపుగా పెరిగి, కాయ నాణ్యత బాగుందని తెలియజేశారు. ఈ రైతు కీర్తి అనే రకాన్ని ఎన్నుకొని, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ, ప్రణాళిక బద్ధంగా పంట సాగు చేస్తూ అధిక లాభాలను పొందుతున్నారు.

### ఎకరానికి సాగు ఖర్చు వివరాలు:

| వివరాలు | బజ్జి మిరప సాగు (రూ.) |
|---|---|
| నారు ఖర్చు | 7,500/- |
| దున్నడం మరియు ఎత్తుమడి | 2,000/- |
| నాటడానికి (కూలీల ఖర్చు) | 1,000/- |
| ఎరువులు నీటిలో కరిగేవి | 10,000/- |
| డ్రిప్ | 50,000/- (మొత్తం) |
| | ఒక సంవత్సరం రూ. 5,000/- |
| మల్చింగ్ షీట్ ఖర్చు | 10,000/- (3 పంటలకు) |
| | ఒక పంట రూ. 3,333/- |

### ఎకరానికి సాగు ఖర్చు వివరాలు:

| వివరాలు | బజ్జి మిరప సాగు (రూ.) |
|---|---|
| పురుగు మందులు | 18,000/- |
| పంట కోత  ఖర్చు | 800/- |
| దిగుబడి | 45 క్వింటాళ్ళు |
| మార్కెట్ ధర | 30 రూ./కిలో |
| మొత్తం ఆదాయం | 1,35,000/- |
| మొత్తం ఖర్చు | 47,633/- |
| నికరాదాయం | 87,367/- |
| ఆదాయ వ్యయ నిష్పత్తి | 1.83 : 1 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8790323457**

### 30వ పేజీలోని పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1 రై | తు | వి | జ్ఞా | 2 న | కేం | ద్రం | | 3 కే | శీ | లు |
| | | | | | ల్ల | | | | | | గు |
| లు | గు | తె | కు | టా | తా 4 | | | | | | తె |
| | | | | | మ | సు | కు 5 | | | | గ్గి |
| | 6 వి | ష | పు | ఎ | ర | | | లు | | | 7 అ |
| 8 సె | | | | | పు | | | ట్ట | | | |
| రి | | | | | రు | | | బు | | | |
| క | బం | ను | 9 పే | | గు | | | 10 క | ర్కు | మి | న్ |
| ల్చ | | | | | | | | ర్ష | | | |
| ర్ | | గు | రు | పు | ల | క్క | రె | క | ల్లి | 11 అ | |
| | | | | | | | | గా | | | |
| 12 పా | ము | పొ | డ | తె | గు | లు | | 13 లిం | | | |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. సి  2. ఎ  3. డి  4. ఎ  5. బి  6. ఎ  7. సి  8. బి  9. ఎ  10. డి**

# వరిలో కాండం తొలిచే పురుగు - సమగ్ర నివారణ

డా॥ డి. వీరన్న, డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ పి. గోన్యా నాయక్, డా॥ వి. రమ్య, బి. సౌందర్య, డా॥ వై. హరి, బి. మాధవి, డా॥ జె. భార్గవి, మానస, డా॥ సిహెచ్. రాములు మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్




1. వేసవి లోతు దుక్కులు చేయటం
2. తట్టుకునే రకాలు సాగు చేయటం
3. సమతుల్య ఎరువుల యాజమాన్యం (నారుమడి, ప్రధాన పొలంలో)
4. గుళికల రూపంలో పురుగు మందుల వాడకం (నారుమడి, ప్రధాన పొలంలో)
5. నారు చివర్లు త్రుంచి నాటు వేయడం
6. లింగాకర్షణ బుట్టలతో నిఘా పెట్టడం
7. పక్షి స్థావరాలు ఏర్పాటు చేయటం
8. జీవ నియంత్రణ పద్ధతులను పాటించడం (ట్రైకో కార్డులు)
9. అవసరం మేరకు నిర్దేశించిన మోతాదులో సిఫారసు చేసిన రసాయన మందులు పిచికారి చేయటం
10. వరి కోసేటప్పుడు సాధ్యమైనంత వరకు క్రిందికి కోయటం

RNI No : TELTEL/2015/60296 March, 2026 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52 Date of Publication : 06.03.2026
Date of Posting : 09.03.2026

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001

# మధిర పెసర - 1 (యం.జి.జి-385)



మొవ్వకుళ్ళు మరియు ఆకుముడతను సమర్ధవంతంగా తట్టుకుంటుంది. పల్లాకు, ఆకుమచ్చ మరియు మారూకామచ్చల పురుగును కొంత వరకు తట్టుకుంటుంది. కాయలు ఒకేసారి కోతకు వచ్చి, గింజలు మధ్యస్థ లావుగా ఉండి అన్ని కాలాలకు అనువైన రకం.

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152